ప్రజాశక్తి

Vol. 3, no. 21

(Nov. 24, 1943)

బెజవాడ, 1943

Record no. 683

Prajāśakti

Vol. 3, no. 21

(Nov. 24, 1943)

Bejavāḍa, 1943

Record no. 683

0-2-0 బెంగాల్ సంచిక Regd. No M. 4486

ప్రజాశక్తి

భారత కమ్యూనిస్టుపార్టీ, ఆంధ్రకమిటీ పత్రిక

సంపుటి 3 సంచిక 21	: సంపాదకవర్గం : మద్దుకూరి చంద్రశేఖరరావు (సం) కంభంపాటి సత్యనారాయణ	★	పుచ్చలపల్లి సుందరయ్య తుమ్మల వెంకటరామయ్య చలసాని వాసుదేవరావు	బుధవారం 24-11-43

"వెండి గాజు"

క్రింద బురద, పైన మబ్బు, ఏనిమిషానైనా వాన రావచ్చు. అయి... వానిలిలో (నెల్లూరుజిల్లా) అంతమంది జనం యేమీటింగుకు రాలేదు.

ఉపన్యాసకుడు ప్రతివారినీ కదల్చివేశాడు. నిద్రపోతున్న దేశభక్తిని ...ల్పాడు. కమ్యూనిస్టు పార్టీకి సహాయం చేయాలన్నాడు.... ఇక వచ్చిప... న్నాయి. అణాలు, పావలాలు.... గుండీలు, పిన్నులు, ముక్కుపుడకలు, వేస... గాజులు....

చిట్టచివర, ఒక మూలగా నుబ్బుంది ఆ 70 ఏండ్ల ముసలి ... తనకి తోచింది ఇవ్వాలనుకుంది. కాని ఎలా ముందుకెళ్లడం? అసలే ... దానికితోడు జనం క్రిక్కిరిసి ఉన్నారు.

పోనీ కేకవేసి చెప్పుదామా? నిమిష నిమిషానికి చప్పట్లు, హర్షధ్వాన... ఇక వ్యవధానం విననిచ్చేదెట్లా?

ఆశ ఏమైపోయింది, ఆరాటంగమైంది, ఆమ్మో, సహాయం చేయ... పోయామే అన్న హృదయభారంతో ఇంటికి నడచిపోయింది ఆ అర్ధరాత్రి.

మరునాడు —

ఇంటిముందుగా ఒక ప్రజారక్షణ దళసభ్యుడు పోతున్నాడు. ఒక్క... కేకవేసింది ఆ ముసలి.

"నాయనా, నిన్నరాత్రి ఇవ్వలేకపోయాను ఈ వెండిగాజు. ఇది తీసు... పార్టీ కిస్తావుకదూ?.... ఇప్పుడు తీసుకుంటారా?...."

"నేను రాలేనుగాని; ఇది తీసికెళ్ళు నాయనా"

ఆ ప్రజారక్షణదళ సభ్యుడు ఒక్కసారి ముగ్ధుడైపోయాడు.

"ఇంత పండుముదుసలినికూడా కదల్చిన ఆ పార్టీ నిజమైన దేశభక్తిగ... కాదంటే ఎవ్వరు నమ్ముతారు" అనుకుంటూ పార్టీ ఆఫీసువైపు సాగిపోయ... ఆ ప్రజారక్షణదళ సభ్యుడు.

★ ఐక్యతావారం

జాతీయ నాయకులను విడుదలచేయాలి ప్రతిష్టంభన అంతంకావాలి

2 లక్షల మంది ప్రజల కోరిక ఇదే

బెంగాలు కరువు, జపాను ప్రమాదం, భారత జాతీయ సమస్యను ముమ్మందుకు తీసుకొచ్చాయి.

భారత జాతీయ సమస్య ప్రపంచ ప్రజా సమస్య. భారత జాతీయ ప్రమాదం ప్రపంచ ప్రజానీకానికి ప్రమాదం. ఈ సత్యాన్ని ప్రపంచ ప్రజలు నానాటికి గుర్తిస్తున్నారు. బ్రిటనులో "భారత నాయకుల్ని విడుదల చేయాలి", "భారత జాతీయ ప్రభుత్వం ఏర్పరచాలి", అనే నినాదాలు బ్రిటిషు ప్రజానినాదాలయాయి. పాలకవర్గంపై ప్రజల ఒత్తిడి నానాటికి నిశింపూతోంది. మన దేశంలో జాతీయైక్యతను నిర్మించుకొని, జాతీయ సమస్యను పరిష్కరించుకోదానికి సోవియట్ విజయాలు అవకాశం కలిగించాయి.

కాని, దేశంలో రాజకీయ అనైక్యత, రాజకీయ ప్రతిష్టంభన, నిమిషానికి 5 గురు భారతీయుల్ని ఆహుతిగొంటోంది. దేశరక్షణను కుంటుపరుస్తోంది. జపాను దాడికి అనుకూల పరిస్థితులను కల్పిస్తోంది.

ఇట్టిపరిస్థితుల్లో ఈసారి, జాతీయ ఐక్యతా వారం జరిగింది.

దేశానికి ప్రధాన శత్రువులు కరువు, జపాను దాడి.

వీటిమీద ప్రతిదేశభక్తుడూ నడుముబిగించి కత్తిగట్టాలి. అంతే రాజకీయ ప్రతిష్టంభన అంతమొందించడానికి, జాతీయ నాయకుల విడుదలకోసం, జాతీయ ఐక్యతకోసం తీవ్ర కృషిచేయాలి. వీటికి అనుకూలురైన అభివృద్ధి నిరోధకుల్ని, జాతీయ విద్రోహుల్ని ఢీకొనాలి. నవంబరు 1 నుంచి 7 వరకు జరిగిన జాతీయైక్యతావార కార్యక్రమమిది.

* * *

ఆంధ్రదేశంలో - 3,500 కమ్యూనిస్టులు, వారి సానుభూతిపరులు, 1,300 గ్రామాలలో, 1,700 మీటింగులద్వారా ఈ ఉద్యమాన్ని కొనసాగించారు.

గ్రామాలలో యించుమించు ప్రతి యింటిలోనూ "జాతీయ నాయకుల విడుదల", "కరువు నివారణ", "దేశరక్షణ", నినాదాలు మారుమోగాయి. వీధి మలుపులు ఉపన్యాస వేదికలయాయి!

బాలబాలికలు, మహిళలు, యువకులు, రైతులు, కార్మికులు, విద్యార్థులు, సుమారు రెండు లక్షలమంది సమావేశాలలో పాల్గొన్నారు. సుమారు 83,000మంది జాతీయ నాయకుల, కమ్యూనిస్టు నాయకుల విడుదల కోరుతూ మహజర్లపై సంతకాలుచేశారు.

25,000 మంది దేశభక్తులు సుమారు 10,000 రూపాయిలు పార్టీకి విరాళాలిచ్చారు. 11,500 మంది వివిధ ప్రజారంగాల్లో సభ్యులుగాచేరారు.

ఐక్యతకు మరికొన్ని పునాదులు

విశాఖపట్నంలో 4 దళాలు 2,750మందిలో ప్రచారంచేశాయి. 1016 మంది మహజర్లపై సంతకాలు చేశారు.

నిరుత్సాహం మూర్తీభవించిన ఒక కాంగ్రెసువాది తారసిల్లాడు. సంతకాలు లాభం లేదు.... స్వాతంత్ర్యంవచ్చేపద్ధతి ఇదిగాదు.... అనే భావాలు వెలిబుచ్చాడు. వెంటనే ప్రచారకులు గాంధీ ప్రకటనలు నిరూపిస్తూ, జపానును మనం ఎందుకు ఎదుర్కోవాలో, అరాచకం గాంధీతత్వం ఎలాకాదో, కరువునివారణను గాంధీ ఎంతప్రాధాన్యంగా చూస్తున్నాడో చెప్పారు. జాతీయైక్యత ఎలా వస్తుందో, అదే నాయకుల్ని ఏవిధంగా విడిపిస్తుందో విశదపరచారు. దాంతో ఆ గాంధీవాది అనుమానాలు మాయమయాయి. పీపుల్సువార్ పత్రిక ప్రతివారం కొంటానని వాగ్దానం చేశాడు. ఒక రూపాయి పార్టీవిరాళంగూడా ఇచ్చాడు.

ప్రచారకదళం ముస్లింలు నివసించే పేటకు వెళ్ళింది. ప్రచార ఫలితంగా ఇద్దరు ముస్లిం పెద్దలు సంతకాలుచేయదానికి ఒప్పుకున్నారు. 40 మంది మహమ్మదీయులు సంతకాలు చేశారు.

ఐక్యతానినాదం, బెంగాల్ కరువు. విశాఖపట్టణ ఎ. ఆర్. పి. వారినికూడా కదల్చాయి. మహజర్లపై సంతకాలు చేస్తామనీ, ప్రజాశక్తి కొంటామనీ వాగ్దానం చేశారు.

జి. రాధాకృష్ణమూర్తి

విద్యార్థులకు స్వాతంత్ర్యంలేదు !

విశాఖపట్టణంలో మెడికల్ కాలేజీ హాస్టల్ విద్యార్థులు 30 మంది సంతకం చేశారు. ఇంతలోనే హాస్టలు వార్డనువచ్చి ఆ సంతకాల కాగితం పుచ్చుకొని చించివేశాడు. ప్రచారకులు ఎంతచెప్పినా వినలేదు. గవర్నమెంటు కాలేజీ విద్యార్థులు ప్రిన్సిపాలుకు తెలియకుండా ఏమీ చేయగూడదని వాదించాడు.

జాతీయవిద్యార్థిసంఘా లంటే

విజయనగరంలో 2-11-43 వ తేదీన విద్యార్థిదినం జరిగింది. 4 దళాలు విద్యార్థులలోనూ, ప్రజాసామాన్యంలోనూ ప్రచారం సాగించారు.

సాయంత్రం విద్యార్థిసభలో ఒకప్పుడు జాతీయ విద్యార్థిసంఘాల్లో ప్రముఖపాత్రవహించిన స్థానిక విద్యార్థిసంఘ కార్యదర్శి పున్నయ్య యీవిధంగా మాట్లాడాడు: "జాతీయ విద్యార్థి సంఘాల్ని స్థాపించడం కేవలం చీలికలు తేవడమే.... విద్యార్థి సంఘాలను కమ్యూనిస్టు సంఘాలని దుష్ప్రచారం చేస్తున్నారు. బహిరంగంగా విద్యార్థిసంఘ ఎన్నికలు జరుగుతూంటే, కమ్యూనిస్టుసంఘాలెలా అయాయి?"

3-11-43 వ తేదీన జాతీయ నాయకుల విడుదల దినంగా జరిగింది. విద్యార్థుల లాడ్జీలలోనూ, హాస్టళ్ళలోనూ తీవ్ర ప్రచారం జరిగింది.

విచ్ఛిన్నకుల వైఖరి

కాకినాడలో ఒక ప్రచారకదళం జాతీయ విద్యార్థినాయకులయిన భీమశంకరం, చివుకుల వెంకటేశ్వర్లను జాతీయనాయకుల విడుదల కోరే మహజర్లపై సంతకాలు పెట్టమని అడిగారు.

జాతీయ విద్యార్థుల నాయకుడుగా పరిగణింపబడుతున్న భీమశంకరం ఈ విధంగా జవాబిచ్చాడు: నేను విడిగా సంతకంచేయను. జాతీయ విద్యార్థులందరూకలిసిచేస్తాం. కమ్యూనిస్టుపార్టీ ఆఫీసుకువచ్చి చర్చిస్తాం రోడ్డుమీద రాజకీయాలు చర్చించడం సమంజసం కాదు।

ఒకవంక భీమశంకరం దాటేస్తుండగానే అతని తమ్ముడు 0-4-0 విరాళమిచ్చి సంతకం చేశాడు.

జాతీయ విద్యార్థి కార్యదర్శికున్న తెలివితేటలు సహాయకార్యదర్శికిలేవు. చివుకుల వెంకటేశ్వర్లు కొంచెం నిజస్వరూపం ప్రదర్శించాడు. సంతకం చేయమంటే "గాంధీజీ వగయిరా జైళ్ళలో ఉండటమే మంచిది" అన్నాడు.

ఈ మాటలు వినగానే అచ్చటఉన్న విద్యార్థులు ఇక నోరుముయ్యమన్నారు. పాపం, వెంకటేశ్వర్లు విద్యార్థి సామాన్యంయొక్క దేశభక్తిని తక్కువ అంచనా వేశాడు.

విద్యార్థి ఫెడరేషను కరపత్రాలు, పార్టీ కరపత్రాలు. జాతీయ విద్యార్థి నాయకత్వాన్ని గుట్టు రట్టుచేశాయి. ప్రచారకులు విద్యార్థి ఫెడరేషను పాలసీ సరైనదనీ, రెండువిద్యార్థి సంఘాల ఐక్యత జాతీయ ఐక్యతకు దారి తీస్తుందనీ గుర్తింపజేశారు. జాతీయ విద్యార్థి సామాన్యంలో సంచలనం కలిగింది. నిజపరిస్థితులు నిలకడమీద గోచరిస్తున్నాయి.

* * *

తూర్పుగోదావరిజిల్లాలో మొత్తం 24దళాలు 45 గ్రామాలలో, 20,000 మందిలో ప్రచారం సాగించాయి. పిఠాపురం, మల్లాం, రామచంద్రపురం, రాజమండ్రిలలో ప్రచారం జరిగింది. 11,000 మందిచే సంతకాలుచేయించారు. 221 మందిముస్లింలు, 1,000 మహిళలు సంతకాలు చేశారు. 1,116-0-0 విరాళాలు పోగుచేశారు.

14 నెలలనుంచీ ఉన్నభయం

పశ్చిమగోదావరిజిల్లా భీమవరం తాలూకా గత ఆగస్టు సంఘటనలవల్ల పోలీసులాఠీలకు గురిఅయింది. ప్రభుత్వ నిరంకుశచర్య భీమవరం వెన్నెముకపై గట్టి దెబ్బ కొట్టింది. ప్రజాసామాన్యం భయపడిపోయింది.

అలాంటి భీమవరం తాలూకాలోనే యీ వారంలో 20 సభలు జరిగాయి. జాతీయ వాంఛకై నిర్భయమైన రాజకీయ ప్రచారం, ప్రజా సమీకరణ, 14 నెలలనుంచీ వున్న భయాన్ని 14 పూటలలో తొలగించివేసింది.

జిల్లాలో 45 దళాలు, 178 గ్రామాలలో ప్రచారం చేసి 49 మీటింగులను పెట్టాయి. 25,000 మంది ప్రజలను కలుసుకొన్నాయి. 12,000 మంది సంతకాలు చేశారు. పార్టీ నిధికి రు. 1600 లు విరాళం పోగయింది. రైతు, మహిళ, యువజన ప్రజారంగాల్లో సభ్యులు చేర్చబడ్డారు.

ఒక లక్ష ప్రజలలో

రైతులు, కూలీలు, మేధావులు, మహిళలు, విద్యార్థులు వర్తకులు, మహమ్మదీయులు-అన్నివర్గాలు, కృష్ణాజిల్లాలో, ఐక్యతా వారంలో పాల్గొన్నాయి. ఇదివరకు చొచ్చుకుపోని గ్రామాల్లో ఐక్యతా నినాదం చొచ్చుకుపోయింది.

1700 మంది వర్కర్లు 170 దళాలుగా 575 గ్రామాల్లో ప్రచండ ప్రచారం చేశారు. 30,000 మంది జాతీయనాయకుల విడుదలకై సంతకాలు చేశారు. 842 మీటింగులలో సుమారు లక్షమంది ప్రజానీకం హాజరైంది. 10,500 మంది ప్రజలు 3000 రూపాయలు పార్టీకి విరాళంగా యిచ్చారు.

నూటికి నూరు

ప్రజా ఉద్యమాలలో సభ్యులు విరివిగా చేరారు.

పాములపాడు, రావులపాడులలో ఉన్న రైతులు, మహిళలు, యువకులు, బాలబాలికలు—100 కి 100 మంది తమతమసంఘాల్లో సభ్యులుగా చేరారు. పేద గూడెంలోని వ్యవసాయకూలీ సంఘంలో అచ్చటి కూలీలు 100 కి 100 మంది తమ సంఘంలో చేరారు.

ప్రజారంగాల్లో యిది ఒక చరిత్రాత్మక ఘట్టం, ఒక నూతన శకం, ఒక నూతన ఆదర్శం.

మనమంతా ఒకటైతే—

దివి తాలూకా, కొత్తపాలెం, కొల్లిపర రామనుజమ్మగారికి 70 ఏండ్ల వయస్సు. జబ్బుగాఉన్నా సభకు

(మిగతా 12 వ పేజీలో)

బుధవారం ప్రజాశక్తి 24-11-43

ఋ ణ ప త్రా లు

జపాన్ దురాక్రమణదారులు దేశసరిహద్దునే పొంచివున్నపుడు, దేశాన్ని రక్షించడానికి, శత్రువును సరిహద్దునుంచి తరిమివేసి బర్మా, మలయా ప్రజలను విముక్తిచేయడానికి, ప్రభుత్వం హెచ్చుఖర్చు పెట్టవలసివస్తుది. యుద్ధకృషిని హెచ్చుచేయడానికి, అవసరసామగ్రిని కొనుగోలుచేయడానికి ప్రభుత్వం కరెన్సీని ఎక్కువ చెలామణి చేయవలసివస్తుంది ఎక్కువ రూపాయనోట్లను అచ్చువేయడం వలన వస్తువుల ఖరీదులు విపరీతంగా పెరుగుతాయి. దీనినే ఇంఫ్లేషన్ అంటారు. దీనిని తగ్గించే ఉద్దేశంతో ప్రభుత్వం ఋణపత్రాలను అమ్మి చలామణిలో వున్న కరెన్సీ నోట్లను తగ్గించడానికి ప్రయత్నించుతుంది. యుద్ధకాలంలో అన్ని ప్రభుత్వాలు యీ విధానాన్ని అవలంబించుతాయి.

ఈవిధంగా ఇండియా ప్రభుత్వం 150 కోట్ల ఋణపత్రాలను అమ్మి కరెన్సీ ఇంఫ్లేషన్ తగ్గించదలచింది. ఇందులో మద్రాసు ప్రభుత్వం 10 కోట్ల ఋణపత్రాలను అమ్మ నిశ్చయించింది. యుద్ధ కృషిని జయప్రదంగా నెరవేర్చడం, జపానును ఓడించడం, ద్వారానే నేటి పరిస్థితులలో మన దేశ స్వాతంత్ర్యం సాధించగలమని కమ్యూనిస్టులం నమ్ముతున్నాము. అందుచే ఇంఫ్లేషన్ తగ్గించడానికి, యుద్ధకృషికి తోడ్పడటానికి ఈ ఋణపత్రాలను తాహతువున్న ప్రజలందరూ కొనాలని ప్రోత్సహించుతాము ప్రజలలో చాలమందికి ఋణ పత్రాలకు తమ డబ్బును వినియోగించడం లాభప్రదమనే విశ్వాసంలేదు. అందుచే అనేకమంది తాముకొన్న ఋణపత్రాలను నూటికి రూ 80 లను పుచ్చుకొని ఇంపీరియల్ బ్యాంకుకు అమ్ముకుంటున్నారు. ఈ భయాన్ని వినియోగించుకొనే కొన్ని ఇన్స్యూరెన్సు కంపెనీలు వగైరా యుద్ధ బాండులను కొనుటద్వారా తమ వ్యాపారాన్ని వృద్ధిచేసికొంటున్నారు.

ప్రజలు తమ డబ్బును పూర్తి విశ్వాసంతో ఋణ పత్రాలను కొనడానికి వినియోగించుకోవచ్చును. పై భయాలన్నీ భ్రమలేగాని సకారణమైనవికావు. ఈ ప్రభుత్వము పోయాక వచ్చే భారత జాతీయ ప్రభుత్వం తప్పక యీ ఋణపత్రాలను చెల్లించితీరుతుంది. ఏమంటే దేశరక్షణకుజరిగే ఖర్చులకు హామీయివ్వడం జాతీయ ప్రభుత్వంయొక్క కర్తవ్యం.

కాని ఋణపత్రాలను అమ్మడానికి ప్రభుత్వం అన్ని డిపార్టుమెంటులను వినియోగించుతూంది. రెవిన్యూ శాఖ, పి. డబ్ల్యు. శాఖ, పోలీసుశాఖ, రిజిస్ట్రేషన్‌శాఖ వగైరా ప్రభుత్వ శాఖలన్నిటిద్వారా ఋణపత్రాలు కొనాలని ఒత్తిడి జరుగుతూంది. ముఖ్యంగా గ్రామాలలో ఒక డిపార్టుమెంటు తరువాత మరొకటి ప్రజలను ఋణపత్రాలను కొనాలని నిర్బంధించుతున్నారనే వార్తలు మాకు వస్తున్నాయి. ఈవిధంగా అన్ని శాఖలద్వారా ప్రభుత్వం ఋణపత్రాలను అమ్మకూడదు. స్వేచ్ఛగా తమంతట తామే కొనునట్లు ప్రోత్సాహపరచాలిగాని, వివిధ శాఖలద్వారా నిర్బంధించరాదు. ఒక రెవిన్యూశాఖద్వారా మాత్రమే అమ్మించాలి.

గ్రామాలలో ఎకరాకు యిన్ని రూపాయల ఋణపత్రాలను కొనాలని ఒత్తిడి చేస్తున్నట్లుకూడా వార్తలు వస్తున్నాయి. డబ్బు నిలవచేసికోడానికి తాహతులేని బీద రైతులను యీవిధంగా నిర్బంధించకూడదు. గ్రామానికి ఋణపత్రాలు అమ్మడానికి ఉద్యోగులు వచ్చినప్పుడు భాగ్యవంతులు, తాహతువున్నవారు కొనాలి. ఎకరానికి యింత చెల్లించుకోవాలని బీదరైతులను ఉద్యోగులు ఒత్తిడి చేయకుండా చూడాలి.

ఈ సందర్భంలో ఇంకో విషయాన్ని ప్రభుత్వం గుర్తించాలని కోరుతున్నాం. ఋణపత్రాల అమ్మకం ముఖ్యంగా ప్రజల విశ్వాసంపై ఆధారపడివుంటుంది. అందుచే ప్రజా విశ్వాసాన్ని సంపాదించడానికి కృషిచేయాలి. అందుకు ఒకటే మార్గంవుంది. జాతీయ నాయకులను వెంటనే విడుదలచేయాలి. ప్రజల విశ్వాసాన్ని చూరగొన్న కాంగ్రెస్ - లీగ్ వగైరా నాయకులతో జాతీయ ప్రభుత్వాన్ని స్థాపించాలి. అపుడు 150 కోట్లు మాత్రమేకాదు: 1500 కోట్లనైనను ప్రజలు నమ్మకంతో, సంతోషంతో ప్రభుత్వానికి పెట్టుబడి పెడతారు. అందుచే ఇంఫ్లేషన్ తొలగించి ఆర్థిక సౌష్ఠవాన్ని కాపాడటానికి జాతీయ ప్రభుత్వ స్థాపన అవసరమనే సంగతి ప్రభుత్వం గుర్తించాలి.

★ మనరాజకీయాలు

ఆహారసమస్యపై కేంద్ర శాసనసభ చర్చలు: లీగ్ సమావేశం

ఆహారసమస్యను గురించి కేంద్రశాసనసభలో వరుసగా ఐదురోజులు చర్చజరిగింది. కాని, పర్యవసానం శూన్యం: డిసెంబరులో కోతకురాబోయే బెంగాల్ వరిపంటను ప్రజల కందజేయుటకై యేవో కొన్ని ఏర్పాట్లు చేస్తూన్నట్లు ఆహారశాఖామంత్రి తెలియజేశాడే గాని, ఆ యేర్పాట్లు ఎట్టివో కొంచెంకూడా సూచించలేదు. డిసెంబరు పంటఖనా తిండి దొంగల చేతుల్లో పడకుండా చేయుటకై ప్రభుత్వం యెట్టిచర్య తీసుకొనబోతూందో తెలుపలేదు. క్రిందటి పునాసపంట మాదిరి ఇదికూడా తిండిదొంగల గిడ్డంగులకు మాయమైతే, బెంగాల్ ఒక పెద్ద శ్మశానభూమిగా మారిపోగలదనే విషయాన్ని ఇండియా ప్రభుత్వం గుర్తించినట్లు లేదు. విదేశాలనుండి యింతవరకు దిగుమతి కాబడిన సరుకు 41,000 టన్నులని శ్రీ వాస్తవ వెల్లడించాడు. బెంగాల్‌కరువును నిర్మూలించుటకై యిది ఏమాత్రం సరిపోదనీ, సముద్రంలో కాకిరెట్ట వంటిదనీ, ప్రభుత్వసభ్యునికి తెలియదా?

మూడు ప్రతిపాదనలు

ఈసారి ఎసెంబ్లీచర్చలో 10 మంది కాంగ్రెసు సభ్యులుకూడా పాల్గొన్నారు. ఐనప్పటికీ వివిధ రాజకీయ పార్టీలవారు బెంగాల్ యొక్క భవిష్యత్తుపై దృష్టినంతటినీ కేంద్రీకరించక, కరువుకు కారకులెవరో విచారణ

కంభంపాటి సత్యనారాయణ

నల్పుటకై కొన్ని ప్రతిపాదనలు తీసుకొచ్చారు. పోనీ, ఈ విషయంలోనైనా ఏకాభిప్రాయం ఉన్నదా అంటే లేదు. శాసన సభా సభ్యులచే ఎన్నుకోబడిన వారితో ఒక విచారణ కమిటీని నియమించాలని అబ్దుల్‌రషీద్ చౌదరీ (నిష్పాక్షిక సభ్యుడు) సూచించాడు. రాయల్ కమీషన్‌ను నియమించడం అవసరమని ముస్లింలీగ్ తరపున యామీన్ ఖాన్ ప్రతిపాదించాడు. ఆర్థిక, రాజకీయ, న్యాయశాస్త్ర నిపుణులతో కూడిన విచారణకమిటీ వుండాలని కె. సి. నియోగి తెలియజేశాడు.

కరువుకు కారణం

బెంగాల్‌కరువుకు అసలు కారణంఏమిటో నేడు దేశంలో తెలియనివారు లేరు. దేశం యొక్క ఆర్థిక నిర్మాణయంత్రం నిరంకుశ ప్రభుత్వం చేతుల్లో ఉండడంవల్లను, ఆ ప్రభుత్వం తిండిదొంగల దోపిడీని అరికట్టుటకు ప్రజల్ని సమీకరించకుండుటవల్లను బెంగాలులో వారానికి 50 వేలమంది చొప్పున ప్రాణాలు విడుస్తున్నారు. రేపు శీతాకాలపు పంటనైనా ప్రజలకు అందించకపోతే బెంగాలు యెట్టి భయంకర పరిస్థితి నెదుర్కోవలసి వస్తుందో ఎవరూ చెప్పలేరు. అట్టి ప్రమాదం జరగకుండా చేయడానికి మార్గం విచారణ సంఘాలు, రాయల్ కమీషన్లు కాదు. తిండి దొంగల్ని దూరంచేయుటకు ప్రజాసమీకరణ.

సభ్యుల విమర్శన

పై మూడు ప్రతిపాదనలమీద సభ్యులు వుపన్యసిస్తూ, ప్రభుత్వ విధానాన్ని తీవ్రంగా ఖండించారు. కేంద్ర ప్రభుత్వానికీ - వివిధ రాష్ట్ర ప్రభుత్వాలకూ, మధ్య యేర్పడిన సంఘర్షణలు ఆహారపదార్థాలకంటె ఎక్కువే వున్నాయని స్వామి వెంకటాచలంశెట్టి ఆక్షేపణ తెలిపాడు. కాంగ్రెసు నాయకుల్ని విడుదల చేయకపోతే కరువు సమస్యను జయప్రదంగా పరిష్కరించడం సాధ్యంకాదని సర్దార్ మంగళసింగ్, డాక్టరు దేశముఖ్, అబ్దుల్ ఖయూం మొదలైన కాంగ్రెసుపార్టీ సభ్యులు ప్రకటించారు. ముస్లింలీగ్ తరపున జిన్నా వుపన్యసిస్తూ "ఇంగ్లండులో కరువు వల్ల కొద్ది వందలమంది ప్రజలు మరణిస్తే, చర్చిల్ ప్రభుత్వం 24 గంటలైనా అధికారంలో ఉండగలిగేదా?" అని ప్రశ్నించాడు. ఎదురుగావున్న ప్రభుత్వ సభ్యుల్ని సంబోధిస్తూ, "ఈ ప్రభుత్వం పూర్తిగా ఉపేక్ష వహించింది. ఏమాత్రపు చాకచక్యాన్నీ అది ప్రదర్శించలేదు. ఇది తన బాధ్యతను పూర్తిగా నిర్లక్ష్యంచేసింది. మీరే నేరస్థులని మీకుమాత్రం తెలియదా? ఈమాత్రంకూడా తెలియకపోతే, భగవంతుడు మిమ్మల్ని రక్షించుగాక!"

ప్రభుత్వ సమర్థన

ప్రభుత్వపక్షాన ఆహారశాఖ కార్యదర్శి హచ్చింగ్స్, సప్లయిమెంబరు రామస్వామి మొదలియారు, ఆహారశాఖాసభ్యుడుశ్రీవాస్తవ, వాణిజ్యశాఖసభ్యుడు అజిజుల్‌హక్, ఉపన్యసించారు. కాని, ఒకరి ఉపన్యాసానికీ, మరొకరి ఉపన్యాసానికీ, ఎట్టి సమన్వయంలేదు. యుద్ధం ప్రారంభమైనప్పటినుంచి నేటివరకు ఆహారసమస్యను పరిష్కరించుటకు సాధ్యమైన చర్యలన్నీ తీసుకోబడ్డాయని సప్లయి మెంబరు వాదిస్తే, ఆహారశాఖ కార్యదర్శి, ఇంతవరకూ ప్రభుత్వం పొరబాట్లుచేసినట్లూ, యిప్పుడుమాత్రం ఒక సక్రమమైన ప్లాను ఉన్నట్టూ, పూర్వంకంటె ఎక్కువబాధ్యతతో ప్రభుత్వసభ్యులు మెలగుతూన్నట్టు, వాదించాడు. వాణిజ్యశాఖసభ్యుడు ఉపన్యసిస్తూ, తాముచేసిన తప్పులు బుద్ధిపూర్వకంగా చేసినవి కావన్నాడు. ఆహారశాఖసభ్యుడు గతించినదాన్ని యెత్తుకోకుండా, భవిష్యత్తును గురించి ఎన్నెన్నో వాగ్దానాలు చేశాడు. ఇక ముందు ప్రభుత్వంచే గట్టిచర్యలు తీసుకొనబడతాయని హామీ యిచ్చాడు.

ఈవిధంగా, ప్రభుత్వ సభ్యులలోనే సమన్వయం కుదరక, అనేక అవకతవకలతో నిండిన పాలసీ దేశంమీద రుద్దబడుతోంది. తామే నియమించిన గ్రిగరీకమిటీ కొన్నాళ్ళ క్రితం ఆహారపదార్థాల దిగుమతిని గురించి, ఆహారధాన్యాల రిజర్వునుగురించి, రేషనింగు ధరలకంట్రోలు మొదలయిన సమస్యలను గురించి, ముఖ్యమైన సిఫార్సులు చేసింది. వాటివిషయంలో కేంద్ర ప్రభుత్వం ఏ యే చర్యలు తీసుకొన బోతూందో స్పష్టంగా ఒక్కరూ తెలియజేయలేదు.

దేశముఖ్ అడిగిన ప్రశ్నకు శ్రీ వాస్తవ జవాబిస్తూ, దేశం అంతటా ధరలకంట్రోలు యిప్పట్లో ప్రవేశపెట్టబడదనీ, రాష్ట్రప్రభుత్వాలకు మాత్రం యిందుకు స్వేచ్ఛ ఈయబడినదనీ, తెలియజేశాడు. దీనిఅర్థం, పంజాబు ప్రభుత్వానికి కేంద్రప్రభుత్వం పూర్తిగా లొంగిపోయి, అక్కడి తిండిదొంగలకు దాసోహం చేస్తూన్నదన్నమాట!

ప్రజలకు బాధ్యతవహించే జాతీయ ప్రభుత్వమే ఆహారసమస్యను సంతృప్తికరంగా పరిష్కరించగలదను విషయం ఈ ఎసెంబ్లీ చర్చలవల్ల బోధపడింది. ఈ విషయాన్ని కొత్తవైస్రాయి గుర్తించవలసియుంది. గుర్తించకపోతే బెంగాల్ కరువుపరిస్థితులే యితర రాష్ట్రాలకు గూడా వ్యాపించగలవనీ, ప్రపంచ ప్రజాభిప్రాయం ఏమాత్రం క్షమించదనీ, ప్రభుత్వం తెలుసుకోవాలి.

ముస్లింలీగ్ సమావేశం

ఆహార సమస్యను పరిష్కరించుటకై ముస్లింలీగ్ సమావేశమైనా ముందుకువచ్చి, ప్రజలనందరినీ (మిగతా 1 వ కాలం)

(4 వకాలం తరువాయి) సమీకరించే కార్యక్రమాన్ని ఈయలేదు. బెంగాల్‌లీగ్‌మంత్రివర్గానికి సహాయం చేయవలసిందని హెచ్చరించటం తప్ప, ప్రధాన రాజకీయ పార్టీలతోగూడిన సంయుక్త మంత్రివర్గ స్థాపనకై పిలుపు ఈయలేదు. ఇప్పటికంటె కఠిన చర్యలు తీసుకొని సమస్యను పరిష్కరించవలసిందని యిండియా ప్రభుత్వాన్ని, బ్రిటిషుప్రభుత్వాన్ని హెచ్చరించడంతో తన పని పూర్తి అయినట్లు భావించింది. బెంగాల్ ప్రధాని సర్ నజీముద్దీన్ లీగు సమావేశం వుపన్యసిస్తూ బెంగాల్ రాష్ట్రం ఇండియానుండి విడిపోయి వున్నట్లయితే బెంగాలును కరువు నుండి కాపాడగలిగి వుండేవారమని తెలియజేశాడు. నేటి బెంగాల్‌పరిస్థితి పాకిస్తాన్ యొక్క అవసరాన్ని రుజువుచేసుకొన్నట్లు సూచించాడు. బెంగాల్ ప్రజలను రక్షించాలంటే హిందూమహాసభ ప్రతినిధులతోగూడిన సంయుక్త మంత్రివర్గం అవసరమని గుర్తించలేదు. బెంగాల్ మంత్రివర్గం తన పాత పాలసీని ఇప్పటికైనా విడిచిపెట్టకపోతే బెంగాల్లో పాకిస్తాన్‌కాదు సరిగదా, నిరంకుశాధికారుల ఏకచ్ఛత్రాధిపత్య పరిపాలన స్థాపించబడుతుంది. ఈ యథార్థాన్ని లీగు నాయకులు యెంత త్వరగా గ్రహిస్తే అంత మంచిది.

19 వ ఆంధ్రరాష్ట్ర విద్యార్థి మహాసభ

ఐక్యకార్యాచరణకు పునాదులు వేసింది

— మా విలేఖరి

క్రిందటి సంవత్సరం కాకినాడలో మహాసభ జరుపుటకు అనుమతినీయలేదు. మన జాతీయ నాయకులు అరెస్టయిన తర్వాత ఆంధ్ర విద్యార్థులు మొట్టమొదటిసారిగా 19వ ఆంధ్ర రాష్ట్ర విద్యార్థి మహాసభను నవంబరు 12, 13, 14 తేదీలలో గుంటూరులో జరిపారు. ఆంధ్ర విద్యార్థి ఉద్యమం యీనాడు రాష్ట్రమంతటా వ్యాపించి, విద్యార్థి జీవితంలోనే మార్పుతీసుకువచ్చింది. రాష్ట్రంలో 100 ప్రదేశాలకు 76 ప్రదేశాలలో విద్యార్థి సంఘాలు ఏర్పడ్డాయి. రాష్ట్రంలో యింతవరకు 11304 విద్యార్థులు సంఘంలో చేరారు అంటే, రాష్ట్రంలోని విద్యార్థులలో మూడవ వంతు విద్యార్థులు సంఘంలోచేరారు. 11 జిల్లాలకు విద్యార్థి ఉద్యమం వ్యాపించింది. కృష్ణా జిల్లాలో కొన్నిచోట్ల నూటికి నూరుమంది విద్యార్థులు సంఘంలోకి వచ్చారు. ఈవిధంగా విద్యార్థి సంఘం ఆంధ్ర చరిత్రలో ఎప్పుడూ లేనంతఅభివృద్ధిచెందింది. ఈమహాసభ ఆంధ్ర విద్యార్థిఉద్యమంలో ఒక చరిత్రాత్మకసమావేశం

ప్రతినిధులు, ప్రేక్షకులు

రాష్ట్రంలోఉన్న 11 జిల్లాలలో బళ్ళారి, కడప జిల్లాలనుండి తప్ప అన్ని జిల్లాలనుండి ప్రతినిధులు వచ్చారు. పదిమంది స్త్రీ ప్రతినిధులుకూడా వచ్చారు. మొత్తం అన్ని జిల్లాలనుండి ప్రతినిధులు, ప్రేక్షకులు 438 మంది వచ్చారు. ఇంతమంది ప్రతినిధులు ఏ విద్యార్థి మహాసభకు రాలేదు. మహాసభను గూర్చి ప్రతినిధులు రైళ్ళలో ప్రచారంచేస్తూ మహాసభకు డబ్బు వసూలు చేశారు. బెంగాల్ క్షామనిధికి కూడా రు 83-3-0 వసూలుచేశారు. మహాసభకు జాతీయ విద్యార్థి సంఘాలలో నున్న దేశభక్తులు కొంతమంది ప్రేక్షకులుగా వచ్చారు. మదరాసు విద్యార్థి సంఘాన్నుంచి రామకృష్ణన్ సౌహార్ద్రప్రతినిధిగా వచ్చాడు.

ప్రశాంత సన్యాల్ ప్రారంభోపన్యాసం

12 వ తేదీన ప్రతినిధుల సమావేశం ప్రారంభమయింది డాక్టర్ సుబ్బరాయన్, శ్రీ కాశీపట్నం కొండయ్యగారు, బెంగాల్ విద్యార్థిసంఘం, కేరళ విద్యార్థిసంఘం పంపిన సందేశాలను కార్యదర్శి చదివాడు. అ. భా. వి. సం. కార్యదర్శియైన ప్రశాంత సన్యాల్ ఒక గంటసేపు ప్రసంగించారు. ఆంధ్రరాష్ట్ర విద్యార్థిసంఘం, అ. భా. వి. సంఘంలో ఒక ప్రముఖ స్థానం వహిస్తూందని చెప్పారు. 11 వేలకు పైగా సభ్యత్వం గలిగి, ఆంధ్ర విద్యార్థి వుద్యమం దినదినాభివృద్ధి చెందుతోందని ప్రశంసించారు. ఈనాడు ఆహారసమస్య చాల తీవ్రమయింది; ముఖ్యంగా బెంగాలులో దుర్భరపరిస్థితు లేర్పడినాయి. బెంగాలులో నిమిషానికి 5 గురుచొప్పున చనిపోతున్నారు. ఈనాడు బెంగాలును ఈ పరిస్థితులనుండి రక్షించకపోతే, ఆరునెలలలో బెంగాలులో 3 వ వంతు ప్రజలుమరణించుటలో సందేహం లేదు. ఈనాడు తల్లులు పిల్లలను, భర్తలు భార్యలను పోషించలేక విడనాడుచున్నారు. ఒక్క మిద్నపూర్ జిల్లాలో దిక్కులేని పదివేలమంది పనికూనలు అన్నంలేక అల్లాడిపోతున్నారు. యువతులు ఆకలిబాధకు తాళలేక వేశ్యావృత్తి నవలంబించుతున్నారు. జాతీయోద్యమానికి పుట్టినిల్లయిన బెంగాల్ ఇలాంటి హీనదశకు దిగజారింది. ఈనాడు మనదేశాన్ని రక్షించాలంటే, బెంగాల్‌ప్రజల్ని కాపాడుకోవాలి. కాన విద్యార్థు లందరూ ఐక్య క్షామ నివారణ కమిటీల నేర్పరచి, సాధ్యమైన సహాయం బెంగాలుకు పంపాలని హెచ్చరించారు.

సుందరయ్యగారి అధ్యక్షోపన్యాసం

తరువాత మహాసభాధ్యక్షులైన సుందరయ్యగారు మాట్లాడారు. ఆంధ్రరాష్ట్ర విద్యార్థి సంఘం ఏఒక్క రాజకీయ పార్టీకో సంబంధించినది గాదని చెప్పారు.

విద్యార్థులలో అనేకరాజకీయాభిప్రాయాలు గలవారుంటారు. విద్యార్థులందరు సమావేశమై మెజారిటీ నిర్ణయించిన ప్రకారమే కార్యక్రమం నిర్ణయించుకొంటారు. ఈ ప్రజాస్వామిక సూత్రాలప్రకారం ఆంధ్రరాష్ట్ర విద్యార్థి సంఘం మొదటనుంచీ పనిచేస్తూంది. ఇటువంటప్పుడు మరొక సంఘాన్ని ఆర్గనైజు చెయ్యడం విద్యార్థి ఉద్యమాన్ని విచ్ఛిన్నం చెయ్యడమవుతుంది.

ఈరోజు ఆంధ్రరాష్ట్ర విద్యార్థిసంఘం, మనదేశాన్ని రక్షించుకొంటూ యుద్ధాన్ని బలపరచుటద్వారానే స్వతంత్రం వస్తుందని చెప్పుచున్నది. ఈనాడు రెండు ముఠాలమధ్యయుద్ధం జరుగుచున్నది. ఒకటి సోవియట్‌రష్యా, చైనా, బ్రిటన్, అమెరికాల ప్రజలు. రెండో పక్షం జర్మను, జపానులు. మనంమొదటిపక్షం గెలవాలని, ఆపక్షం గెలిస్తేనే ఏదేశానికైనా స్వాతంత్ర్యం నిలుస్తుందని చెపుతున్నాం. ఈ పక్షం గెలవాలని మనం కోరే టప్పుడు మనం యుద్ధానికి తటస్థంగా ఉండటంలో కాని, వ్యతిరేకంగా ఉండటంలోకాని అర్థంలేదు. ఈ యుద్ధాన్ని బలపరచుటద్వారానే మన స్వాతంత్ర్యపోరాటాన్ని ముందుకు తీసుకు పోగలుగుతాం. దానికిగాను ప్రతిరైతు ఎక్కువ పంటలు పండించాలి. ప్రతి కార్మికుడు ఎక్కువ ఉత్పత్తి చెయ్యాలి;

మన జాతీయ కాంగ్రెసుకూడా మిత్రరాజ్యాలు గెలవాలని చెప్పింది. మిత్రరాజ్యాలకు తోడ్పడుటకు, మన దేశాన్ని రక్షించుకొనుటకు జాతీయ ప్రభుత్వం కోరింది. కాని ప్రభుత్వం జాతీయ ప్రభుత్వాన్ని యివ్వనిరాకరించి, నాయకులను అరెస్టు చేసింది. విధ్వంసక చర్యలు కాంగ్రెసు కార్యక్రమమనే వారినందరినీ ప్రజలనుండి వేరుపరచి, నాయకుల విడుదలకు విద్యార్థులంతా ఐక్యంకావాలని సుందరయ్యగారు హెచ్చరించారు.

తరువాత కార్యదర్శి రెండుసంవత్సరాల నుంచి ఫెడరేషన్ చేసినపని రిపోర్టుఇచ్చాడు.

జాతీయ విద్యార్థుల పరివర్తన

మహాసభలో ప్రధాన చర్చనీయాంశము విద్యార్థి వుద్యమంలో ఐక్యతను తీసుకురావడం గురించి. ఈ తీర్మానాన్ని కార్యదర్శి తమ్మారెడ్డి సత్యనారాయణ ప్రతిపాదించాడు. విద్యార్థులంతా ఐక్యంకావడానికి కనీస కార్యక్రమం సూచించబడింది. ఈ తీర్మానంమీద ప్రతి జిల్లానుంచి ఒకరు మాట్లాడారు. విద్యార్థి వుద్యమంలో ఐక్యతతీసుకువస్తామని, విచ్ఛిన్నకులను వేరుచేస్తామని, వారంతా వుద్ఘాటించారు. మహాసభకు వచ్చిన జాతీయ విద్యార్థి సంఘాల దేశభక్తులు తమ అభిప్రాయాలను ఇచ్చారు. ఇదివరకు కృష్ణాజిల్లాలో జాతీయ విద్యార్థి సంఘాలను ఆర్గనైజు చేసిన టి. యస్. వెంకటేశ్వరరావు విద్యార్థిసంఘ కార్యక్రమం చాలా బాగావుందని, జాతీయ విద్యార్థిసంఘాలను ఆర్గనైజుచేయడం,విద్యార్థి ఉద్యమాన్ని విచ్ఛిన్నం చేయుడమని చెప్పి, జాతీయవిద్యార్థిసంఘానికి రాజీనామా నిచ్చారు. నందిగామ జాతీయవిద్యార్థిసంఘ కార్యదర్శియైన మాధవరావు, జాతీయ విద్యార్థిసంఘ వర్కరైన ఇబ్రహింలుకూడా సంఘపాలసీ బాగావుందని చెప్పి జాతీయవిద్యార్థి సంఘానికి రాజీనామా ఇచ్చినట్లు ప్రతినిధులందరిముందు ప్రకటించారు. తురుమెళ్ళ జాతీయ విద్యార్థి సంఘ సభ్యులయిన ఎ. సుబ్రహ్మణ్యంగారు కూడా మాట్లాడారు. విద్యార్థిసంఘంలో పని చేసేవారు దేశద్రోహులని చెప్పిన తప్పుడు ప్రచారాన్ని ఇదివరకు తెలుసుకోలేకపోయానని, ఈమహాసభకు వచ్చుటవల్ల నిజాన్ని తెలుసుకోగలిగానని చెప్పి, జాతీయ విద్యార్థి సంఘసభ్యత్వానికి ఆయన రాజీనామాఇచ్చారు. ఈవిధంగా మహాసభలో ఏకగ్రీవంగా అంగీకరింపబడ్డ ఐక్యతా తీర్మానంయొక్క ఫలితాలు ముందుగానే కనబడ్డాయి. ఈ దేశభక్తుల ప్రకటనలు విద్యార్థి ఉద్యమ విచ్ఛిన్నకులను వేరుచేసి విద్యార్థి ఐక్యతను నిర్మించడానికి మహాసభలోనే పునాదులు వేసినాయి.

వైజ్ఞానిక కార్యక్రమం

13 వ తారీఖు అంతా వైజ్ఞానికకార్యక్రమం. ఉదయం కాలేజీ విద్యార్థులకు ఇంగ్లీషులోను తెలుగులోను వాగ్వాద పోటీలు జరిగాయి. హైస్కూలు విద్యార్థులకు తెలుగులో ప్రత్యేకంగా పోటీలు ఏర్పాటు చేయబడ్డాయి. స్త్రీ విద్యార్థినులుకూడా ఈపోటీలలో పాల్గొన్నారు.

తుంటరి మూకల అల్లరి

ఆ సాయంత్రం టౌనుహాలులో వైజ్ఞానిక పోటీలు జరగవలసియుంది. అందుచేత ప్రతినిధు లందరు క్యాంపునుండి ఊరేగింపుగా బయలుదేరి జయజయ ధ్వానాలతో టౌనుహాలుకు వెళ్ళుతున్నారు. జాతీయ విద్యార్థి సంఘాలలోని కొందరు టౌనుహైస్కూలు విద్యార్థులచే రాళ్ళు రువ్వించారు. పెదనందిపాడునుంచి వచ్చిన ఒక ప్రతినిధికి తల చిట్లి నెత్తురు ప్రవహించింది. ఇటువంటి ఘోర కృత్యాలకు ఒడిగట్టిన వీళ్ళనుదేశభక్తులనాలా? లేక గూండాలనాలా? తరువాత టౌనుహాలులో సమావేశమయిన విద్యార్థు లందరియెదుట సుందరయ్యగారు ఉత్తేజపూరితంగా ఉపన్యసించారు. ఏరక్తాన్ని మనం యిక్కడ కళ్లారా చూచామో ఆ రక్తం సాక్షిగా మనం విద్యార్థి ఉద్యమ విచ్ఛిన్నకులను వేరు చేయుటకు వాగ్దానం చేయాలని, ఆరక్తం సాక్షిగా మనం విద్యార్థి ఉద్యమంలో ఐక్యత తీసుకురావాలని చెప్పారు.

తరువాత తాపీ ధర్మారావుగారు ఒక గంటసేపు "ప్రజలు- సాహిత్యం" అను విషయంపై మాట్లాడారు. తరువాత వైజ్ఞానిక పోటీలు ప్రారంభమయినాయి. పోటీలలో గుంటూరు, కృష్ణా దళాలు ప్రధానపాత్రలు వహించినాయి. గుంటూరుజిల్లా దళం అనేక కొత్తప్రదర్శనాలు జరిపింది. ఇందులో బెంగాల్ అసెంబ్లీచర్చలు ఒకఅంశం. బెంగాల్‌ప్రజలు నిమిషానికి ఐదుగురు చొప్పునచనిపోతుంటే, బెంగాలులోని రాజకీయపార్టీలు ఏవిధంగా ఐక్యత లేకుండా కొట్లాడు కుంటున్నాయో కళ్ళకు కట్టినట్లు యిందులో చూపించారు. ఇంకా గుంటూరుజిల్లా దళం లంబాడీడాన్సును ప్రదర్శించింది. దీనిలో అందరూ బాలికలే పాల్గొన్నారు. గుంటూరుదళంలో ఇంకా "హిట్లరుపై విచారణ" బ్యారీపాటపేర్కొనదగినవి. కృష్ణాజిల్లాదళం ఉర్దూశైలిలో "జపానుతో పోరాడరావాలీ జనులందరూ" అనే పాటను చక్కగా పాడారు. కృష్ణఅనే 12 ఏండ్ల బాలుడుకృష్ణాజిల్లాదళంలో ప్రత్యేక బహుమానం పొందాడు. ఆబాలుడు "ఫణీ చక్రవర్తికీ, ప్రభలకృష్ణమూర్తికీ జండనీడనిలచి నీవు జోహారులీయరా" అని పాడుతూంటే నిజంగా విద్యార్థులంతా ఆ విద్యార్థి వీరులకు జోహారులర్పించారు. మొత్తం 3 గంటలసేపు ప్రదర్శనం జరిగింది. గుంటూరు దళం 18 ప్రదర్శనాలు, కృష్ణాదళం 14 ప్రదర్శనాలు, పశ్చిమగోదావరి దళం రెండు ప్రదర్శనాలు, జరిపాయి. ఇతరజిల్లాలవారు వ్యక్తిగతంగా పాల్గొన్నారు. మొత్తం మూడువేల ప్రజలు ప్రదర్శనాలకు హాజరయ్యారు. గుంటూరుజిల్లా దళానికి ప్రథమ బహుమానం వచ్చింది. కృష్ణాకు రెండవబహుమానంవచ్చింది

ఊరేగింపు : మహాసభ

14 వ తారీఖు సాయంత్రం ప్రతినిధుల క్యాంపునుండి ఊరేగింపు బయలుదేరింది. 19 వ మహాసభకు చిహ్నంగా 19 జతల ఎడ్లు బండికి కట్టబడ్డాయి. బండిమీద పెద్ద తడికల మీద "ఆహార సమస్యా పరిష్కారానికి నాయకులను విడుదలచేయాలి," "దేశరక్షణకు నాయకులను విడుదల చేయాలి," "కాంగ్రెసు-లీగు ఐక్యతకావాలి," "విద్యార్థులంతా ఐక్యంకావాలి." అనే నినాదాలు పెద్ద పెద్ద అక్షరాలతో వ్రాయబడినాయి. వివిధ స్థానిక, జిల్లాసంఘాల బేనర్లతో (Banners) విద్యార్థి పతాకాలతో ఊరేగింపు కోలాహలంగా జరిగింది.

సాయంత్రం 6½ గంటలకు ఊరేగింపు స్వరాజ్య మైదాన్ చేరింది ఊరేగింపు చేరేసరికే మైదానం 4000 మంది ప్రేక్షకులతో క్రిక్కిరిసిపోయింది. సుందరయ్యగారి అధ్యక్షత క్రింద మహాసభ ప్రారంభ మయింది. ప్రశాంత సన్యాల్ ప్రారంభోపన్యాసం చెప్పుతూ వుండగా కొందరు విద్యార్థి వుద్యమ విచ్ఛిన్నకులు సభనుచెడగొట్టడానికి మధ్యలో లేచి గల్లంతు చేయడం మొదలుపెట్టారు. వలంటీర్లు ఈ విచ్ఛిన్నకులను బయటకు నెట్టివేశారు. సభ తరువాత జయప్రదంగాజరిగింది. సుందరయ్యగారి అధ్యక్షోపన్యాసం పూర్తి అయినతరువాత కార్యదర్శి తీర్మానాలను చదివాడు. వివిధ జిల్లాలకు వివిధ విషయాలలో బహుమతులీయబడ్డాయి. కృష్ణాజిల్లా అన్ని విషయాలలోను ఆదర్శంగా పని చేసినందుకు స్వాతంత్ర్యము, శాంతి, అభ్యుదయములు అమర్చిన "రెడ్‌స్టార్" ఇవ్వబడింది. తూర్పుగోదావరికి చిత్రకళలోను, పశ్చిమగోదావరికి నూటికి నూరు సంఘాలు ఆర్గనైజు చేసినందుకు, అనంతపూర్‌కు "స్టూడెంటు" పత్రిక అమ్మకానికి, గుంటూరు వైజ్ఞానిక దళానికి విద్యార్థి జండా లివ్వబడినాయి: వాగ్వాద పోటీలలో పాల్గొన్నవారికి కూడా బహుమానా లివ్వబడ్డాయి.

నూతన కార్యనిర్వాహకవర్గం

తమ్మారెడ్డి సత్యనారాయణ,

(ప్రధానకార్యదర్శి)

యస్. వి. నరసయ్య, బి. వి. రావు, కె. వెంకటప్పయ్య

(సహాయ కార్యదర్శులు)

సభ్యులు :

వి. మధుసూదనరావు, యమ్. రామకృష్ణారావు (కృష్ణా) కె. వి. బసవయ్య, వి. గోపాలరావు (గుంటూరు) యి. వెంకటేశ్వర్లు (వైజాగ్) డి. యస్. చౌదరి, యమ్. పట్టాభిరామయ్య (తూ. గో.) వి. వి. యస్. శర్మ, యమ్. నరసింహారావు (ప. గో.) శ్రీనివాసులురెడ్డి (నెల్లూరు) గంగిరెడ్డి, తిరుమలరెడ్డి (అనంతపూరు) యస్. జానకి (కృష్ణా)

రైతు వాలంటీర్ల కృషికి ప్రశంసలు

★

కర్నూలుజిల్లా పత్తికొండ తాలూకాలో క్షామనివారణ కేంద్రములు ఏర్పాటుచేయ బడ్డాయి. వాటిలో దాదాపు 50,000 కూలీలు పనిచేయుచు వచ్చిరి. పైరులు కోతకు వచ్చుటచే కూలీలకు పనులు దొరుకుట వలన నవంబరు మాసములో కేంద్రములన్నిటిని ప్రభుత్వం యెత్తివేసింది.

ఈపరిస్థితులలో "ఆంధ్రరాష్ట్ర రైతు సంఘం" కరువు నివారణ కేంద్రములలో కూలీల సౌకర్యముల కొరకు పనిచేయుటకు వాలంటీర్లను పంపుటయేగాక, పీడిత ప్రజలకు సహాయార్థము రాయలసీమ కరువు నివారణ నిధిని ప్రోగుచేయుటకు కూడ ముందడుగు వేసి కృషి చేసింది. ఇప్పటికి మా తాలూకాకు రు. 1350/- లు. 2 పాతబట్టల బేళ్ళు పంపింది. పంపిన ద్రవ్యములో 18 ఆముదపు డబ్బాలు. పనిపిల్లల తలలకు. 75 చీరలు వస్త్ర విహీనలకు కరువు కేంద్రములలో పంచి పెట్టబడినవి. ఇంకను రు. 500 గుడ్డలు మిగిలియున్నవి. వీటిని కరువు పీడితగ్రామాలలోని ప్రజలకు త్వరలో పంచిపెట్టుటకు ప్రయత్నించుచున్నాము.

కరువు నివారణ కేంద్రములలో పనిచేసిన వాలంటీర్లు నివాసమునకు తగు వసతిలేక. అన్నపానాదులకు తగు సౌకర్యములు లేక అనేక నష్టకష్టముల కోర్చి కూలీల దైనందిన సమస్యలపై కేంద్రీకరించి వారికి జరుగు అన్యాయములను నివారించుటకు సర్వవిధముల కృషిచేసిరి.

ఈ కరువు చేత పీడించబడిన రైతుకూలీ సోదర జనసామాన్యము యెడల తమ ధర్మమును నిర్వర్తించుటకు కృషిచేసిన ఆంధ్ర రాష్ట్ర రైతుసంఘమునకు మా తాలూకా క్షామ నివారణ కమిటీ పక్షాన ధన్యవాదాలు అర్పించుచున్నాము.

ఆంధ్రమహాసభవారు కూడ రు. 4000. బట్టలను ఈ కరువు ప్రాంత వస్త్ర హీనులకు ఇచ్చి తగు రీతిని ఆదరించి రాయలసీమ వాస్తవ్యులయెడ తమ కర్తవ్యమును నెరవేర్చినందులకు మా కృతజ్ఞతను వెల్లడించుచున్నాము.

ఇట్లు
తాలూకా కరువునివారణ కమిటీ సభ్యులు.

1. డాక్టరు. బి. మాధవయ్య. (అధ్యక్షుడు) 2. యల్. వెంకటప్ప. (కార్యదర్శి. కాంగ్రెసు ప్రముఖుడు) 3. తొమ్మంద్ర లక్ష్మీనరసయ్య. (కాంగ్రెసుప్రముఖులు) 4. హెచ్. శ్రీరాములు.(ఆగస్టుసంఘటనల్లో అరస్టయి. ఇటీవలనేవిడుదలయారు) 5. వి. రామశాస్త్రి.

ఆంధ్రదేశాన్ని రెండవ బెంగాల్‌గా చేయవద్దు

★

ఆంధ్రరాష్ట్ర రైతుసంఘ కార్యదర్శి నండూరి ప్రసాదరావుగారు యిలా వ్రాస్తున్నారు:

ప్రభుత్వం కొంత ధాన్యాన్ని పర్చేజింగు డిపార్టుమెంటుద్వారా కొంటూవుంది. కాని ఆధాన్యానికి ఇటీవల ధరలు పెంచినట్లు మాత్రం ప్రకటించబడ్డది. కాని ఎంత పెంచినదీ. ఏఏ ధాన్యాల ధరల కెంత పెంచినదీ బహిరంగంగా ప్రకటించలేదు. కాబట్టి ఇటీవల మద్రాసు ప్రభుత్వానికి ఒక లేఖ వ్రాస్తూ ఈ క్రింది విషయాలను తెలుపమని కోరాను.

1. రైతుల జీవిత ప్రమాణాన్ని నిర్ణయించడంలో ప్రభుత్వం ఏలెక్కలను ఆధారం జేసుకొంది?

2. ఇటీవల ధాన్యాలకు పెంచిన ధరలేమిటి?

3. ఆంధ్రరాష్ట్రంలోకూడా ఈ ధాన్యపు ధరలు హెచ్చింపబడ్డవా?

ఇందుకు ప్రభుత్వం జవాబిస్తూ మొదటి ప్రశ్నకు జవాబునీయ వీలుపడదని తెల్పింది. ధాన్యం ధరలు ఈక్రింది విధంగా హెచ్చింపబడ్డాయనీ, ఈ హెచ్చింపు ఆంధ్రదేశంలో హెచ్చు ధాన్యం పండే ప్రాంతాలకుకూడా వర్తిస్తుందనీ తెల్పారు.

వడ్లు నెం 1, 2 లకు మణుగు 1 కి	0- 7-0
.. నెం 3 కు	
మొలకొలుకులకు మణుగు 1 కి	0- 5-6
బియ్యం నెం 1, 2 లకు మ॥ 1 కి	0-10-0
.. నెం 3 కు ..	0- 8-0

(మణుగు అనగా 82 $\frac{2}{7}$ పౌనులు)

మరిన్ని ప్రభుత్వం ఇటీవలనే ఇంతవరకూ బియ్యంపై వసూలుచేయబడే సర్చార్జికూడా మినహాయించ బడుతుందని తెల్పారు. ఈ సర్చార్జికింద వడ్లబస్తా 1 కి 0–4–0 చొ॥ మినహాయిస్తూ వచ్చారు. అది ఇకముందు మినహాయించబడిక రైతుకే ఇవ్వబడుతుంది.

ఈ విధంగా రైతుసంఘం బస్తా 1 కి రు 11–0–0 లకు ధరలు పెంచాలన్న కోర్కె నెరవేరింది.

కాని షాహుకార్లు అప్పుడే హెచ్చు ధరలకు జట్టీలకు పుచ్చుకుంటున్నట్లుగా వార్తలు వస్తున్నాయి. నిజంగా ఈ హెచ్చుధరల ఆశకల్పించేది రైతులపై ప్రేమతోకాదు. ధాన్యం మార్కెటుపై కంట్రోలు లేకపోవుటచే వీరు ధాన్యాన్ని అంతటినీ ప్రస్తుతం చేజిక్కించుకొని బియ్యంగా అధిక ధరలకు మనకే అమ్మడానికి వీరు సిద్ధంఅవుతారు. బెంగాలులో పునాసపంటను జాగ్రత్తపెట్టక పోవుటచే పంటలన్నీ షాహుకార్ల చేతుల్లోకి పోయి కరువు ఏవిధంగా జాస్తిఅయినదో మనం పత్రికలలో చూస్తూనే వున్నాము. బెంగాలు అంతా రాబోయే పంటలపైననే ఎంత ఆశపెట్టుకొని వున్నదో. ఆపంటను జాగ్రత్త పెట్టుటకై ప్రభుత్వం ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నదో చూస్తున్నాము. కాబట్టి బెంగాలు గతి మనకు పట్టకుండావుండాలంటే రాబోయే మనపంట షాహుకార్ల రహస్యపు గిడ్డంగులలోకి పోకుండా చూడాలి. కాబట్టి హెచ్చుధరల కాశపడి షాహుకార్ల కమ్మి ఆంధ్రదేశాన్ని రెండవ బెంగాలుగా చేయకుండా. పర్చేజింగు డిపార్టుమెంటుకు ఆహార కమిటీలద్వారాగాని. (మిగతా 9 వ పేజీలో)

పాత తగాదాలను మరపించారు

తెన్నేరు గ్రామంలో మామ అల్లుళ్లకు కట్నం తాలూకు భూమివిషయమై తగాదా వుంది. ఆ తగాదా తమలోతాము పరిష్కారం చేసికోకపోవడం అలావుంచి, అది వ్యవసాయ కూలీలదాకా ప్రాకనిచ్చారు. ఇద్దరూ తలా ఒకరికి కౌలుకిచ్చారు. వ్యవసాయ కూలీలు కోర్టులకు వెళ్ళి ఒకరిపై ఒకరు ఇంజెక్షన్ నోటీసులు జారీచేసికొన్నారు. ఉభయులూ కక్షలు పెరిగి దొమ్మీలకు సిద్ధమవుతున్నారు.

జాతీయైక్యతావారంలో ప్రచారంచేస్తున్న బెజవాడ తాలూకా వ్యవసాయ కూలీ సంఘ ధ్యక్షులు ఇరుగు యేసుదాసుగారికి ఈవిషయం తెలిసి జోక్యం కలుగచేసికొన్నారు. గ్రామ రైతుల సంఘ కార్యదర్శిగారిని మరి ఇద్దరు రైతు వర్కర్లను సంప్రదించి ఐదుగురు పంచాయితీదార్లను నియమించారు.

మామ దగ్గర కౌలుకు తీసుకున్న ఇద్దరు. అల్లునివద్ద కౌలుకుతీసుకొన్న అతనూ-ముగ్గురూ తీర్పు నిర్ణయాలకు బద్ధులమౌతామని డిపాజిట్లు కట్టారు.

ఈ పంచాయితీ చేసిన తీర్పుకు ఇరుపక్షాల వారు ఆమోదించారు. అల్లుని కౌలుదారు ఊడ్చిన ఖర్చులను మామగారిచ్చారు. పంట మామ కౌలుదారునకే ఇప్పించారు.

★

వైరాప్రాజెక్టు

ఈ సంవత్సరం నారుమళ్ళకు నీరు ఆమర్దాదు 10 (జూన్ 2 వ వారం) తర్వాత వదిలారు. అపుడు చెరువులో సుమారు 10 అడుగుల నీరుంది. ఆ పాషి (పి. డబ్ల్యు. డి.) వారు బాగా నారు పెరిగిన వారికి నాటువేసికొనేందుకు అర్డరిచ్చారు. రైతులు తమకున్న భూమిలోని 3 వ వంతు భూమిలో నాటువేసికోమని చెప్పారు. ఆ రకంగా కొంతకాలం గడిచాక వంతుల ప్రకారం నీళ్ళు ఇవ్వడం ప్రారంభించారు. సెప్టెంబరు 2 వ వారం వరకు ఎలాగో ఆపాషి (పి. డబ్ల్యు. డి.) నీరు సప్లయి చేశారు. కాని తర్వాత వంతులులేవు. నీరు బాగా వదిలారు. ఇపుడు చెరువులో 9 అడుగుల నీరుంది. కాని మొత్తం మీద పైర్లు చూస్తే తేటగాలేవు. అనేక తెగుళ్ళు ఉన్నాయి. దీనికి కారణం వంతుల ప్రకారం నీరు వదలుటే.

ఈ సంవత్సరం ప్రాజెక్టుక్రింద తరీ (మాగాణి) యైన పొలం 8 వేల ఎకరాలుంటుంది. రెండు కార్లుగా వేశారు. మొదటిసారి నాల్గువేల ఎకరాలలో వేశారు. అదొక మాదిరిగా వుంది. మిగతాది చాలవరకు చెడిపోతుంది (తలఫ్‌మాల్ అవుతుంది.) రెమిషన్ ఇవ్వవలసిన భాగంగా తయారవుతుంది. కొన్నిచోట్ల ఒక నంబరులోనే కొంత నాటు వేసి మిగతాది వేయకుండా ఖాళీగా ఉంచవలసి వచ్చింది. ప్రభుత్వం చెప్పినట్లు 3 వ వంతు కంటె ఎక్కువ నాటువేసిన పొలాలకు నెంబరు మింజువలె రకంగా సొంతంగా అంటకడతారని వదంతిగావుంది. రైతులిందువల్ల భయపడు తున్నారు. పోనీ మెట్ట పైరు వేద్దామంటే చుట్టు పక్కల నీరుండడంవల్ల వీలులేకపోయింది. పోనీ ఇపుడు దమ్ముచేసి కొత్తగా సాగుచేద్దామంటే. మొదట వేసిన పైరే తేటగా లేదని రైతులు భయపడుచున్నారు. కాన ప్రభుత్వం విచారించి తగిన సౌకర్యాలు కల్గించవలసిందని రైతులు కోరుచున్నారు.

అఖిలభారత రైతుమహాసభకు సన్నాహాలు

★

ది 13–11–43 తేదీ ఉదయం గం 8 లకు శ్రీ కడియాల గోపాలరావుగారి అధ్యక్షతను. ఆంధ్రరాష్ట్ర రైతుసంఘ సాధారణ సభ్యుల సమావేశం. సంఘకార్యాలయం (బెజవాడ)లో జరిపి ఏకగ్రీవంగా ఈ దిగువ తీర్మానములను ఆమోదించారు.

(1) 1944 సంవత్సరం మార్చిలో బెజవాడలో జరుగబోతున్న అఖిల భారత కిసాన్ సభ, 8 వ మహాసభకు సంఘ కార్య నిర్వాహకవర్గ సభ్యులే ఆహ్వానసంఘము యొక్క అర్గనైజింగ్ కమిటీగా, పనిచేయుటకున్నూ. ఆహ్వానసంఘ సభ్యులను చేర్పించుటకున్నూ. సభా కార్యనిర్వహణకు కావలసిన ప్రచురణ. సభావేదిక, పాకలు మొదలయిన వాటిని ఏర్పాటుచేయుటకున్నూ. ఈసంఘము వారు తీర్మానించుచున్నారు. ఈకమిటీకి కన్వీనరుగా శ్రీ నండూరి ప్రసాదరావుగారిని నియమించడమైనది.

(2) రాయలసీమలోపరిస్థితులు కొంతవరకు చక్కబడినందున రాయలసీమ కరువు నిధి వసూళ్ళను నిలిపివేస్తూ గావించిన ప్రధాన కార్యదర్శి ప్రకటనను యీసభవారు ఆమోదించుచున్నారు.

రాయలసీమలో కరువు క్యాంపులను ప్రభుత్వం ఎత్తివేస్తున్నందున కరువు క్యాంపులవద్ద పనిచేస్తున్న వాలంటీర్లను వెనుకకు పిలిపించి వేయుటకు తీర్మానించడమైనది.

రాయలసీమ నిధి జమాఖర్చులను ఆడిట్ చేయించుటకు తీర్మానించుచూ, అందులకు అవసరమగు చర్యగైకొనుటకు అధ్యక్షులకు అధికార మివ్వడమైనది.

(3) ఈదిగువ సూచించబడ్డ తేదీలలో సభ్యులను చేర్పించుటకున్నూ, నామినేషన్లు, ఎన్నికలు, మహాసభ జరిపించుటకున్నూ ఈసభవారు తీర్మానించుచున్నారు.

ప్రాథమికసభ్యులను చేర్పించుటకు ఆఖరుగడువు	31–12–43
జిల్లాలలోచేరినసభ్యులసంఖ్య. కోటా. ధనము. జిల్లాఆఫీసులకు చేరవలసిన ఆఖరు తేదీ	10–1–44
రాష్ట్ర ఆఫీసుకు చేరవలసిన ఆఖరుతేదీ	15–1–44
జిల్లాసంఘమునకు సభ్యుల నామినేషన్లు	25–1–44
జిల్లాసంఘసభ్యుల ఎన్నికలు	3–2–44
రాష్ట్ర సంఘమునకు సభ్యులను, అ. భా. కిసాన్‌సభకు డెలిగేట్లను ఎన్నుకొనవలసినసంఖ్యలను జిల్లాసంఘములకు రాష్ట్ర సంఘము తెలియజేయుట	5–2–44
నూతనజిల్లా రైతుసంఘసమావేశం, రాష్ట్ర సంఘ సభ్యుల: అ. భా. కి. సభ డెలిగేట్లను ఎన్నుకొనుట	10–2–44
ఎన్నికలఫలితాలను రాష్ట్రఆఫీసుకు తెలియజేయు గడువు	15–2–44
అ. భా. కి. సభ అధ్యక్షస్థానానికి అభ్యర్థి పేరు సూచించుట	15–2–44
నూతనరాష్ట్రసంఘసమావేశం కార్యనిర్వాహకవర్గాన్ని: అ. భా. కి. సభ కౌన్సిలు సభ్యులనూ ఎన్నుకొనుట	26–2–44
సెంట్రల్ కిసాన్ కౌన్సిలు మీటింగు ప్రారంభం	12–3–44
అ.భా.కి. సభ సబ్జెక్ట్సుకమిటీ మీటింగు ప్రారంభం	15–3–44
అ.భా.కి. సభ వార్షికసమావేశం	17 & 18–3–44

బెంగాల్ కరువుకు అసలు కారణం ఏమిటి?

బెంగాల్‌పట్ల నిరంకుశాధికారవర్గం అవలంబిస్తూ వచ్చిన పాలసీ ఎట్టిదో పరిశీలిద్దాం. ఈరోజున దేశంలో అధికారం అంతా వీరి చేతుల్లోనే ఉంది. దేశంయొక్క ఆర్థిక నిర్మాణాన్ని నడిపించేది వీరే. ఇట్టి అధికారవర్గం అవలంబించేవిధానాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తే. బెంగాల్ ప్రజలు నేడు కరువు రాక్షసికి ఎందుకు ఆహుతి అవుతున్నారో సులభంగా తెలుసుకోవచ్చు.

బెంగాల్‌లో ధరల కంట్రోలు పేరుకు మాత్రమే ప్రవేశపెట్టబడింది గాని. అసలు జరపడానికి కాదు. ప్రభుత్వం తన యుద్ధావసరాలకై ఆహారపదార్థాలను చౌకగా కొనుక్కోడానికి యిదొక చక్కని ఉపాయం. వర్తకుడు మాత్రం ప్రజలకు ఎంతధరకైనా అమ్ముకోవచ్చు! బెంగాల్ అధికారవర్గం నిలవ వ్యాపారస్తులకు వ్యతిరేకంగా ప్రజల్ని సమీకరించడం పోయి, వారి దయాదాక్షిణ్యాలకు ప్రజల్ని విడిచిపెట్టారు. ధరల కంట్రోలును ఉల్లంఘించినందుకు 100 మందికంటె యెక్కువ తిండిదొంగల్ని విచారణకు పెట్టలేదు. సుమారు 1 సంవత్సరంనుండి ఏవర్తకుడూ కంట్రోలు ధరలకు అమ్మిన పాపాన పోలేదు. అయినప్పటికీ, తిండిదొంగలకు మొనగాళ్ళయిన వారెవరినీ దేశరక్షణచట్టం క్రింద ఆరెస్టు చేయలేదు. ఆర్థిక జీవనాన్ని స్తంభింపజేస్తూ, ప్రజల ఆహారాన్ని దాచివేసి, ప్రక్కనే ఫాసిస్టురాక్షసులు పొంచికూర్చున్న సమయంలో దేశంయొక్క మనోనిబ్బరాన్ని నాశనంగావిస్తున్న దొంగవ్యాపారస్థుల్ని యెట్టి కఠినశిక్షలకు గురిచేయలేదు.

తిండిదొంగల ప్రచారం

1942 జనవరిలో బియ్యం ధర మణుగు రు. 6. నవంబరు నెలాఖరుకు యిది రు. 11 అయింది. ఈవిధంగా తిండి దొంగలు తమ యిష్టమైన ధరకు అమ్మడంచూచి, కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు, సైన్యాధికారులు. తమతమ ఏజంట్లద్వారా సరుకును కొనడం ప్రారంభించారు. ఈ పరిస్థితిని తిండిదొంగలు పూర్తిగా వినియోగించుకున్నారు. వ్యాపారపు కిటుకులన్నీ వీరి చేతులలో ఉన్నాయి. 1942 వ సంవత్సరంలో పండిన శీతకాలపు పంటలో ఎక్కువ భాగాన్ని దాచివేసి, ప్రజలకు యీ విధంగా చెప్పసాగారు: "ఉన్న సరుకు ప్రభుత్వం, సైన్యాధికారులు కొనేసుకున్నారు. అయినా. నావద్ద కొద్దిగా మిగిలింది దాన్ని మణుగు రు. 14 రేటుకు యిస్తాను, తీసుకోండి!" ఇది 1943 జనవరిలో జరిగిన ఉదంతం. అప్పటికి కోతలు పూర్తిఅయి, ధాన్యం పుష్కలంగా లభించింది. నవంబరులో కంటే ధర తగ్గడానికి అవకాశంఉంది. కాని, తగ్గడానికి బదులు హెచ్చింది!

ఇంతధర పెట్టి సరుకును కొనడం బెంగాల్ ప్రభుత్వానికి అసాధ్యం అయింది. తగినంత స్టాకు ప్రభుత్వానికి లభించడంలేదు. ఇదిమార్గం కాదనుకొని, హక్ మంత్రివర్గం ధరల కంట్రోలునే ఎత్తివేసింది. ఇలాచేస్తే వర్తకులు సరుకును విరివిగా మార్కెట్లోకి తీసుకొస్తారని ఆశించింది. పాపం! తీసుకొచ్చిన మాట నిజమేగాని, మణుగు రు 24 రేటుకు తక్కువలేదన్నారు. అనగా, రైతుల వద్ద కొన్న ధరకు రెట్టింపు కట్టి అమ్మసాగారు. రాష్ట్రమంతటా ఆకలి జ్వాలలు వ్యాపించసాగాయి. తిండి దొంగల మాయ నాటకం ప్రజలకు వెల్లడి అయింది. హక్ మంత్రివర్గమే దీనికంతకూ కారణమని, అధికారవర్గం దాన్ని గెంటివేసింది.

కాని. ఈ మందువల్లకూడా రోగం నయం కాలేదు: పైగా, ఎక్కువయింది. ఈసారి కేంద్రప్రభుత్వం చికిత్సచేయ సాగింది. బెంగాల్‌కు ప్రక్కనున్న అస్సాం, ఒరిస్సా. బీహార్ రాష్ట్రాలలో స్వేచ్ఛా వ్యాపారాన్ని ప్రవేశపెట్టింది. ఫలితం, ఈ 3 రాష్ట్రాల తిండి దొంగలకు మంచి అవకాశం చిక్కింది వారు బెంగాల్ రేట్లతో సమానమైన రేట్లకు ధరలు పెంచారు. ఈవిధంగా, బెంగాల్ ప్రజలు కరువునుండి రక్షించబడకపోగా. పై 3 రాష్ట్రాలలోను తిండిదొంగల దోపిడీ యెక్కువైంది. బెంగాల్ రాష్ట్రంలో నిలవ వ్యాపారాన్ని అణచకుండా, బయటి రాష్ట్రాల నిలవ వ్యాపారస్తులపై ఆధారపడడంవల్ల జరిగిన ఫలితంయిది!

తిరిగి ధరల కంట్రోలు!

జూలై పంట పండగానే, బెంగాల్‌లో ఆగస్టు 26 న తిరిగి ధరల కంట్రోలు ప్రవేశపెట్టబడింది. కాని, 2 రోజుల్లో పంటయావత్తూ మార్కెట్లోనుంచి మాయమయింది. బెంగాల్ అంతకూ నెలకు 2¼ కోట్ల మణుగులు అవసరం. ఈ పంటవల్ల షుమారు 5 కోట్ల మణుగుల వరకు లభించాయి. అయినప్పటికీ, సెప్టెంబరు, అక్టోబరు నెలలలో దొంగ మార్కెట్టు రేటు కలకత్తాలో మణుగు రు 40: ఇతరచోట్ల రు. 100 వరకూ పెరిగింది!

ఈసారి బెంగాల్‌లో దృశ్యం ఆకలి మంటలుకాదు, ఆకలిచావులు! తెరమీదికి మళ్లా కేంద్రప్రభుత్వం తయారయింది. తానే స్వయంగా స్టాకులు సప్లయిచేస్తానని వాగ్దానం చేసి, పంజాబుకు పరుగెత్తింది. కాని, పంజాబులో మాత్రం తిండిదొంగలుతక్కువా? వారు కూడా ధరలు విపరీతంగా పెంచారు.పోనీ, ఆ యెక్కువ ధరలకైనా తగినన్ని స్టాకులను సప్లయి చేశారా, అంటే లేదు. కొంతసరుకును మాత్రమే సప్లయిచేసి, మిగతా దాన్ని రహస్యపు గిడ్డంగులలో దాచివేశారు. బెంగాల్‌లో ఇంకా కరువు ఎక్కువై, ఇంకా ప్రజలు నశిస్తే, ధరలు యింకా పెరుగుతాయని వీరి ఉద్దేశం.

అధికారవర్గపు నిస్సహాయత

పంజాబు యూనియనిస్టు మంత్రివర్గం హిందూ ముస్లింతిండిదొంగల ఐక్యసంఘటన, వీరు ప్రభుత్వానికి ఎప్పుడూ దాసోహం చెయ్యడమే పని. పంజాబు మంత్రివర్గంమీద కేంద్ర ప్రభుత్వం ఒత్తిడి ఎక్కువ చేస్తూన్నకొద్దీ, పంజాబు సైనికుల కుటుంబాలలో అసంతృప్తి వ్యాపించుతుందని పంజాబు మంత్రివర్గం బెదిరించ సాగింది. ఒకమూల బెంగాల్‌లో కరువు రాకాసి వేలకొద్దీ ప్రజల్ని పొట్టను బెట్టుకొంటూంటే, మరోవైపు కేంద్ర ప్రభుత్వం పంజాబులోని తమ జోహుకుం వాలాలనులొంగదీయలేక, నిస్సహాయంగా ఆకాశంవైపు చూడసాగింది. ఈవిధంగా, బెంగాల్ తిండిదొంగల్ని లొంగతీయడానికై పంజాబ్ తిండి దొంగలపై ఆధారపడ్డంవల్ల వారిని ఒప్పించడంపోయి, వారికే లొంగిపోవలసి వచ్చింది. పంజాబులో పరిపాలనాయంత్రం తిండిదొంగల స్వాధీనంలోవుంది. వీరికి వ్యతిరేకంగా అధికారవర్గం ఏమీ చేయలేకుండా కూర్చుంది. స్టాకుల కంట్రోలు పెత్తనం పూర్తిగా తిండి దొంగలకే వుండడంవల్ల, ప్రజలు వారిదయాదాక్షిణ్యాలకు లొంగవలసిస్తూంది. ఈ పెత్తనాన్ని ఎవ్వరూ ధిక్కరించకుండా చేసుకొనేటందుకు విరివిగా లంచాలిచ్చి లోబరుచుకొంటున్నారు. శీతాకాలపు పంటకోతకు వచ్చేలోగా తగినంత సరుకును బెంగాలుకు పంపడానికి కేంద్ర ప్రభుత్వం వాగ్దానంచేసింది. కాని, అసలు సమస్య ఏమంటే ఈ పంట ప్రజలకు అందడ మెల్లాగ? లంచగొండి వుద్యోగస్థులు రవాణా సౌకర్యాలను వెంటనే కలుగజేయక, ఎంతవరకు సాధ్యమౌతుందో అంతవరకు ఆలస్యంచేస్తారు. సరుకు పంపకాన్ని స్తంభింపచేస్తారు. తిండి దొంగలు సాధ్యమైనంత ఎక్కువ సరుకును రహస్యపు గిడ్డంగులలో చేర్చడానికి సహాయపడతారు.



కా|| ప్రేడ్ పి. సి. జోషి

సైన్యం తన స్వాధీనంలో వున్న సరుకును విడుదలచేసిన మాట వాస్తవమే. రవాణా సౌకర్యాలు కలుగజేసి, పంపకం విషయంలోసైన్యంచక్కని శ్రద్ధ వహిస్తోంది. ప్రజలకు-సైన్యానికి మధ్య అన్యోన్యభావంకూడఏర్పడుతోంది. ప్రజల ఆహారాన్ని సైన్యం లాక్కుపోవడంవల్లనే కరువు వ్యాపించినదని ప్రచారం చేసే తిండి దొంగల నినాదం పటాపంచలు చేయబడుతోంది. కాని, సైన్యం తాత్కాలికంగా మాత్రమే సహాయం చేయగలుగుతుంది. సమస్యాపరిష్కారం దానిచేత కాదు.

మలయా – బర్మాల ఉదాహరణ

సామ్రాజ్యవాద పరిపాలనక్రింద వలస దేశాల రక్షణ యెంత చక్కగా ఉంటుందో, మలయా–బర్మాలు ప్రపంచానికి తెలియజేశాయి. అలాగే సామ్రాజ్యవాదుల పరిపాలనలో వలసదేశాల ఆర్థిక నిర్మాణం ఎలావుంటుందో నేటి బెంగాల్‌రాష్ట్రంయొక్క విషాద గాథ తెలుపుతూంది.

బెంగాల్ ప్రజల్ని కరువు ఎంత విషమ స్థితికి తీసుకువచ్చిందంటే, తిండిదొంగల పెత్తనాన్ని కూలద్రోయడానికి బెంగాల్ ప్రజ లందర్నీ సమీకరించడం తప్ప మరొక పరిష్కారమార్గం లేదు. కాని, అధికారవర్గం ప్రజలవైపుచూడ్డానికే నిరాకరిస్తోంది. బెంగాల్‌కు పట్టినగతే ఇతర రాష్ట్రాలకుకూడ పట్టకుండా కాపాడటానికి ప్రజలందరిలోను దేశభక్తిని వుత్తేజపరచడం అవసరం. కాని, అధికారవర్గం ప్రముఖజాతీయనాయకులందర్నీ బంధించివేసింది.

ముస్లింలీగ్ పోకడ

ఈవిధంగా నిరంకుశాధికారులు బెంగాల్ రాష్ట్రాన్ని నిలవవ్యాపారస్థులకు భూతలస్వర్గముగా మార్చివేస్తూంటే, ప్రజలకు తిండిపెట్టి పోషించడానికి వివిధ జాతీయసంస్థలు యేమి చేశాయి? తిండిదొంగలకు వ్యతిరేకంగా ప్రజలందర్నీ సమీకరించడానికి యెట్టి పాత్రను నిర్వహిస్తున్నాయి?

బియ్యం ప్రజ లందరికీ అవసరమే. హిందువులకు. ముస్లింలకు సమానంగా అవసరం.కాని,బియ్యాన్ని హిందూవ్యాపారస్థులు. ముస్లిం నిల్వవ్యాపారస్థులు దాచేశారు. ఇది కేవలం హిందువుల మధ్య. ముస్లింల మధ్య ఉన్న సమస్య కాదు. ప్రజలందరి మధ్య. తిండిదొంగలమధ్య వున్న సమస్య.

ఈనిల్వవ్యాపారస్థులు అధికారవర్గాన్ని లోబరచుకొన్నట్టుగానే వివిధ రాజకీయ పార్టీలనుకూడ లోబరచుకుంటూరా? లేక బెంగాల్ రాజకీయ నాయకులు ధైర్యంగా ముందుకు వచ్చి, తమలోనే వున్న దొంగల్ని ప్రజలకు చూపి, వారిని అణచడానికి ప్రజలందర్నీ సమీకరిస్తారా? ఇదే నేడు బెంగాల్‌రాష్ట్రాన్ని ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య.

ముస్లింలీగ్ మంత్రివర్గం మొదటిరోజుల్లో సరిగానే పని ప్రారంభించింది. కాంగ్రెసు నాయకుల విడుదలను కోరుతూ తీర్మానించింది. కాంగ్రెసు – ముస్లింలీగు ఒడంబడిక అవసరమని ప్రకటించింది. సంయుక్తమంత్రివర్గ స్థాపనకై డాక్టరు శ్యామ్‌ప్రసాద్‌ముఖర్జీకి క్కొన్ని చక్కని సూచన లిచ్చింది. ఫజ్లుల్ హక్ మాత్రం మంత్రివర్గంలో ఉండడానికి నిరాకరించింది. కాని, శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ ముస్లిం ప్రజలకు ప్రాతినిధ్యం వహించని ఫజ్లుల్‌హక్‌ను విడిచిపెట్టలేదు. ముస్లింప్రజాసామాన్యానికి ప్రతినిధిసంస్థయైన లీగ్‌మంత్రివర్గంతో చేయి కలుప నిరాకరించాడు.

ఫలితం, బెంగాల్‌రాష్ట్రం అంతా సర్వనాశనం అయే పరిస్థితులు సంభవించాయి. బెంగాల్ జాతీయనాయకులు ప్రజలందరికీ తిండిపెట్టి రక్షించడానికి ఏకం కావడానికి బదులు, తమ తమ నిలవవ్యాపారస్తుల చేతుల్లో కీలుబొమ్మలుగా తయారై, ఒకరిపై మరొకరు పోరాటం ప్రారంభించారు.

లీగ్ మంత్రివర్గం ఏకాకిగా ఆహారసమస్యను పరిష్కరించవచ్చునని ఎందువల్ల భావిస్తోంది?

మొదటికారణంఏమంటే,త్వరలోస్టాకుల్ని సప్లయి చేస్తానని కేంద్ర ప్రభుత్వం చేసిన వాగ్దానాలపై ఆధారపడడం. కాని ఆ వాగ్దానాలకు ఏలాంటి గతిపట్టిందో మనం చూచాం. రాష్ట్రంలో ఆకలిమంటలు వ్యాపించుతూన్నకొద్దీ ప్రతికక్షుల తుపాను ఎక్కువ కాసాగింది. నిరంకుశాధికార వర్గాన్ని లీగ్ మంత్రివర్గం కప్పిపుచ్చుతూందనే ప్రచారం నానాటికి వృద్ధిచెందింది. తోడి దేశభక్తుల సహకారంపై ఆధారపడకుండా, అధికారవర్గంవైపు అర్రుచాచి కూర్చోడంవల్ల జరిగిన ఫలితం యిది.

ముస్లిం వ్యాపారస్థుల ప్లాను

రెండవకారణం: ఇతర రాష్ట్రాలనుండి వచ్చేసప్లయిలకొరకు (మిగతా 8 వ పేజీలో)

బెంగాల్ నశిస్తే బ్రతికేదెవరు?

— పి. సి. జోషి

నేను కలకత్తాను బాగా యెరుగుదును. రహస్యంగా వుండేకాలంలో సంవత్సరంనర కలకత్తాలో నివసించాను బహిరంగంగా వచ్చాక యేటా వెళ్ళివస్తున్నాను. ఇపుడు ఒకసంవత్సరం తరువాత కరువుపరిస్థితులను ప్రత్యక్షంగా చూడటానికి అచటికి వెళ్ళాను. దినపత్రికలలో ప్రకటించబడిన వార్తలు, ఫొటోగ్రాపులు, పార్టీనుండి మాకు వచ్చిన రిపోర్టులు కూడ కరువు మహామారిని సరిగ్గా చిత్రించలేదని కండ్లారా చూచాక నాకు అర్థమయింది.

★

కలకత్తా చేరి 15 నిమిషాలయిందో లేదో "మాధాకవళం అమ్మా" అంటూ దీననాదం వినిపించసాగింది. నేను మురికిగూడాలలో, బీదల ఇండ్ల మధ్య యిదివరకు నివసించాను. కలరా ప్రాంతాలలో పనిచేశాను. కాని, నేను బసచేసిన మిత్రుని ఇంటి కిటికీలోనుంచి వినిపించుతున్న ఆరిపోయిన పొడి గొంతులోనుంచి వెలువడే ధ్వని, అలాంటి ఆకలుడిగిన కండ్లు యెచటా యిలా నామనస్సును కలచివేయలేదు.

1 లక్షా 25 వేల అనాధులు

నేను కలకత్తా అంతా తిరిగాను. ఎచట చూచినా వీధులవెంట అనాధల గుంపులే. అధికారులు, యూరోపియన్లు నివసించే "చౌరంఘీ" మినహాయిస్తే అన్నిచోట్ల యీ దీనులు ప్రత్యక్షం. కలకత్తా నగరంలోనే 1,25,000 మంది అనాధులుంటారు. వీధులలోనే వారి నివాసం. పీలికలయిన వారి దుస్తులనుండి వాసన చిముడుతూ వుంటుంది. అపుడే గ్రామాలనుంచి వచ్చిన కొంచం ఓపిక వున్నవారైతే ఏవో గొణుగుతుంటారు. లేదా తలక్రింద చేయిపెట్టుకొని వీధిలోనే ఒకవైపున కుటుంబమంతా కుప్ప కూలినట్లు పడివుంటుంది. వారిలో యువకులు సాధారణంగా కన్పించరు. హెచ్చుగా స్త్రీలు, పిల్లలు, కొలదిమంది వృద్ధులు వుంటారు. ఇలాంటి భీతిగొల్పే దృశ్యాలు చూచేకొలదీ యీ పరిస్థితుల విషమరూపం నాకు బోధపడసాగింది.

నేను బెంగాల్‌లో ఆరు వారాలున్నాను. అన్నిటికంటె ఎక్కువగ భీకర క్షామానికి గురి అయిన చిటగాంగ్‌లో 10 రోజు లున్నాను. రాష్ట్రపార్టీ ఆర్గనైజర్ల సభలో వుండి అన్ని జిల్లాలనుండి రిపోర్టులు విన్నాను. లీగ్ మంత్రులు సర్ నజీముద్దీన్, సుహ్రావర్దీలతో మాట్లాడాను. వ్యతిరేకపక్ష నాయకుడు శ్యామ్ ప్రసాద్‌తోనూ, యూనివర్సిటీ ప్రొఫెసర్లతోనూ, పత్రికాధిపతులతోనూ, క్షామనివారణకు పనిచేసే వర్కర్లతోను సంప్రదించాను. నాల్గు వారాల సంపూర్ణపర్యాలోకనం తరువాత నేడు బెంగాలు నెదుర్కొంటున్న విషాదగాధ బోధపడింది. ఆగాధనే యిచట వ్రాస్తున్నాను.

బెంగాల్ విషాదగాధ

బెంగాల్ జనసంఖ్య 6 కోట్లు. అందులో 5 కోట్ల 50 లక్షలు గ్రామాలలో నివసించుతారు. వీరిలో వ్యవసాయ కూలీలు, చేతిపనివారు 1 కోటిమంది వుంటారు. వారు గత 6 నెలలనుంచిక్షామబాధఅనుభవించుతున్నారు. గ్రామాలలో వారికి పనిలేదు. రైతులు పని చేయించుకొని కూలి ఇవ్వడానికి ధాన్యంలేదు. డబ్బు కూలి నిరుపయోగం. ఎందుకంటే గింజలు దొరకవు. అడుక్కోడం ప్రారంభించుతారు. కాని, బిచ్చమెత్తడంవల్ల కుటుంబం గడువదుగదా! అందునా గ్రామంలో ఒక భాగం జనసంఖ్య, 100కి 15 నుంచి 30 వరకు బిచ్చగాండ్రయితే పోషణ ఎలాజరుగుతుంది?

వీరు తమ గ్రామాలను వదలడానికి సాధారణంగా యిష్టపడరు. కాని, ఆకలి వారిని ఇండ్లనుంచి, గ్రామాలనుంచి తరుముతోంది. మొదట్లో పడుచువాళ్ళు సంపాదించి యింటికి పంపుదామనే ఆశతో యేదైనావృత్తికోసం బయలుదేరుతారు. కాని వారికి దొరకే కూలి పొట్టనింపుకోడానికే చాలదు.

ఈలోగా యింటివద్ద ఆకలిబాధ మరింత దుర్భరమవుతుంది. పసిపాపలు, ముదుసలులు మరణించుతారు. సంపాదించి పంపుతామని వెళ్ళిన కుమారుడు, లేక భర్తలకోసం కుటుంబం ఎదురు చూస్తుంది. మనియార్డరులేదు. ఏమీ పంపలేక పోయామనే సిగ్గుతో వారు చివరి కొక కార్డుముక్కయినా రాయరు. మిగతా కుటుంబమంతా ఆలోచించుకొంటుంది. మిగిలిన సామాను కాస్తా అమ్మివేసి, కూలికోసం, అన్నంకోసం పట్టణాల ముఖం పడతారు.

కాని, ముసలివాళ్ళను, పిల్లలను ఎవరు పనిలో పెట్టుకుంటారు? అందులోనూ పల్లెటూరి వాడు పట్టణంలో ఏమి పని చేయగల్గుతాడు? ఆకలుడిగేవరకు వారు పనికోసం తిరుగుతారు. శక్తినశించాక, నిస్పృహతో బిచ్చమెత్తడం ప్రారంభించుతారు. అనాధలయి వీధుల్లోనే నివసించుతూ ఉచితభోజనశాలలో పోసే గంజికోసం ఎదురు చూస్తూ వేచివుంటారు. తమ గ్రామాలను వదలడానికి యిష్టపడనివారు అచటే కృశించి నశించిపోతారు. ఈ విధంగా కుటుంబాలకు కుటుంబాలు తుడిచిపెట్టుకు పోతున్నాయి.

కౌలుదారులు

వ్యవసాయకూలీల తరువాత కౌలుదార్లు, బీదరైతులు వస్తారు. వీరి జనసంఖ్య సుమారు కోటిన్నర వుంటుంది. గత 3 మాసాలనుంచి వీరు కరువుబాధ అనుభవించుతున్నారు. రాబోయే 3 నెలల్లోవీరిస్థితి మరింత దుర్భరమవుతుంది. ఎపుడూ వీరికి యేడాదంతా సరిపోయే ధాన్యం వుండేదికాదు. లేని నెలలలో జమీందార్లనుంచి, షాహుకార్ల నుంచి ధాన్యం అప్పుతెచ్చుకునేవారు.

ఆషాహుకార్లు యిప్పుడు అప్పు యివ్వడం లేదు. జమీందారు ధాన్యంయివ్వడంలేదు. తమ కౌలుదార్లను, రైతులను మళ్ళీ పంట వచ్చేదాకా పోషించడం కంటే దొంగమార్కెట్టులో ధాన్యం అమ్ముకోడం వారు లాభప్రదంగా ఎంచుతున్నారు. లెక్కలేనంతమంది దిక్కులేనివారు కన్పించుతూంటే కూలీలకు కరువేమిటి? అనుకొంటున్నారు. ప్రాణాలు ఎంత చౌక అయిపోతున్నాయి! క్రమంగా కౌలుదార్లు, బీదరైతులుకూడా వ్యవసాయ కూలీలవలెనే పొట్టకూటికోసం తమ స్వగ్రామాలను వదలివేయాలని వస్తూంది.

ఈవిధంగా మొత్తం రెండున్నరకోట్ల ప్రజలు తమ గడ్డను వదలి అన్నాతురులై పట్టణాలకు వెళ్ళుతున్నారు. గ్రామాలలో సగం జనాభా యీవిధంగా కదలిపోవడంవలన గ్రామ ఆర్థిక నిర్మాణం కూలిపోవడం ప్రారంభించుతోంది. కలకత్తా చుట్టూవున్న 4 జిల్లాలలోనూ శీతాకాలపు పంటను కోయడానికి కూలీలు దొరకడం దుర్లభమవుతుంది. అందుచేతనే పట్టణాలకు చేరిన అనాధులందరిని తిరిగి వారి గ్రామాలకు పంపాలనే ఆర్డినెన్సు చేయబడింది. ఈ అనాధులందరిని అన్నమిడి రక్షించి, మందులిచ్చి ఆరోగ్యవంతులనుచేసి యిండ్లకు చేర్చితేగాని శీతాకాలపు పంటను మాసూలు చేసే గతి వుండదు. ముందు సంవత్సరం సాగుచేసే వ్యవసాయకులు లేక ఆహారకరువు మరింత విషమించుతుంది.

మధ్యతరగతి రైతులు

ఈవిధంగా కరువుతో బాధపడేది వ్యవసాయ కూలీలు బీదరైతులు మాత్రమేకాదు. క్రమంగా మధ్యతరగతి రైతులు కూడా కరువు పాలబడుతున్నారు. దీనికి ఉదాహరణగా రైతుల ఆస్తి ఏవిధంగా అమ్మివేయబడుతుందో ఒకసారి చూస్తే బోధపడుతుంది. రంగపూర్ జిల్లాలోని "నీల్‌ఫమారీ" రిజిస్ట్రార్ యిలాకాలో గత మూడు నెలలలోనూ 11,915 క్రయ దస్తావేజులు రిజిస్టరు చేయబడ్డాయి. క్రిందటి యేడాది అంతా కలిసి 4369 రిజిస్టరు అయ్యాయి. అనగా 12 రెట్లు అమ్మకం పెరిగింది. నారాయణగంజ్‌లో రోజుకు 150 నుంచి 195 అమ్మకాలుగాని తాకట్లుగాని జరుగుతున్నాయి.

ఈవిధంగా భూమి రైతులచేతుల్లోనుంచి షాహుకార్ల చేతుల్లోకి పోతూంది. భాగ్యవంతులు మరింత భాగ్యవంతులవుతున్నారు. బీదలు మరింత బీదలవున్నారు. మధ్యతరగతి రైతువద్ద కూడా ధాన్యం లేకపోవడానికి కారణం ఏమిటి? ఎందువలన అమ్మివేశాడు? నిల్వవర్తకులు రైతులను మోసపుచ్చి ధాన్యం ఎలా కాజేయ కలిగారో చూదాం:

1942 జనవరిలో బియ్యం మణుగు 1 కి రూ 6 అమ్మతోంది. 42 నవంబరులో రూ. 11 1943 జనవరిలో 14రూ. అమ్మింది. ఇంత ఖరీదులు రైతు ఎన్నడూ చూచి ఎరుగడు. నిల్వవర్తకులు యింత మంచి ఖరీదులు యిక ముందు రావనీ, వెంటనే అమ్మివేయండని రైతులను ప్రోత్సహించారు. మోసపోయిన రైతులు ఖరీదులు పడిపోతాయేమో అనేభయంతో ధాన్యం అమ్మివేసారు. అవసరమైతే ధరలు తగ్గాక మరల కొనవచ్చునని ఆశించారు. కాని ఖరీదులు ఇంకా పెరుగసాగాయి. 1943 ఏప్రిల్‌కు మణుగు 1 కి రూ 24 లకు మించింది. ఈ విధంగా రైతులు వర్తకుల మోసంలో పడ్డారు. తన అవసరాలకు మరల హెచ్చుధరలకు కొనవలసి వచ్చింది. డబ్బువదిలింది. క్రమంగా ఆస్తికూడా అమ్ముకోడమో, తాకట్టుపెట్టడమో జరుగుతోంది.

గ్రామాలలోనిమధ్యతరగతివారు భూమిపై వచ్చే ఆదాయంపైనా, కొంత ఉద్యోగాలు చేస్తున్న తమ కుమారుల జీతాలపైన ఆధారపడి వుంటారు. వీరికికూడ యిపుడు కడుపు నిండా భోజనం దొరకడంలేదు. పిల్లలకు మాత్రం పెట్టి మిగిలినది పెద్దవాళ్ళు పంచుకుంటున్నారు. వారికి డబ్బుఉందిగాని గింజలు కొనడానికి చాలడంలేదు. గ్రామాలలో నేనచటవున్నప్పుడు మణుగు 1 కి 40 నుంచి 50 రూపాయీల వరకు ఖరీదుంది. కాని సాధారణంగా ఖరీదు 50 నుంచి 100 రూ. మధ్య ఎంతైనా వుండొచ్చు. అందుచే నగలు, సామాను అమ్ముకోవలసి వస్తూంది.

వేయేల, గ్రామాలలో జమీందార్లు, షాహుకార్లు మినహాయించితే కడుపార భోజనం ఎవరికీ దొరకడంలేదు.

పట్టణాలలో స్థితి

పట్టణాలలో 50 లక్షల జనం నివసించుతున్నారు. అనేకసార్లు వాగ్దానాలు జరిగాయిగాని, ఇంతవరకు రేషనింగ్ ఎచటా ప్రవేశపెట్టనేలేదు. చిన్న పట్టణాలన్నీ దొంగమార్కెట్టుపైనే ఆధారపడవలసి వస్తూంది. అందుచే బీదల, మధ్యతరగతి ప్రజల స్థితి దుర్భరం అయిపోతూంది. ప్రభుత్వం అపుడపుడు కొన్ని సప్లయిలు పంపుతూంది. కాని అవి ఏమూలకూ చాలవు. కొన్ని రోజులు విపరీతమైన ధరలకుగాని బియ్యం దొరకడం లేదు. డక్కా నవాబుగారి చుట్టమైన సర్ నజీముద్దీన్ తన యింటివద్ద నుంచి సైతం తాము పావురాలకు దాచిన గింజలను తింటున్నామని వార్త వచ్చిందని తెలిపాడు.

కలకత్తాలోకూడ రేషనింగులేదు. ప్రభుత్వోద్యోగులు, కార్మికులు వగైరామాత్రం యజమానులనుండి రేషన్లు (భత్యాలు) పుచ్చుకొంటున్నారు. కార్మికునికి తనకు సరిపడే రేషన్ మాత్రమే వస్తుంది, కుటుంబానికి రాదు. మిగతా కొరకు దొంగమార్కెట్టుపైన ఆధారపడవలసి వస్తూంది. రేషనింగుప్లాను నూటికి 50 మందికి మాత్రమే వర్తించుతుంది. ఇతరులకు దొంగమార్కెట్టేగతి. లేదా పస్తుండాలి. కంట్రోలు డిపోలలో మనిషికి శేరు పిండి అరున్నర అణాలకు యిస్తారు. అదికూడా అందరికి దొరకదు.

ఇదీ బెంగాలు విషాద గాధ. ప్రజలు దిక్కులేనివారై క్రమంగా మరణోన్ముఖులౌతున్నారు. నైతికంగా పతన మవుతున్నారు. ఆర్థిక వ్యవస్థ భగ్నమైపోయింది. సామాజిక జీవితం విచ్ఛిన్నమైపోతూంది.

కుటుంబవిచ్ఛిత్తి

కుటుంబాలు యెలా భగ్నమౌతున్నాయో తెలుపు గాధలు అనేకం విన్నాను. గ్రామాలలో బీదకుటుంబాలనుండి యువకులు కూలి కోసం కుటుంబాన్ని వదలి వెళ్లుతారు. ముసలాడు ఆకలితో మాడుతూ, ఒకపొట్ట తగ్గినా మంచిదేనని భార్యను బయటికి తరుముతాడు. అత్త కోడల్ని యింటినుండి వెడలగొడుతుంది. లేదా కోడలే అత్తను తరిమివేస్తుంది. వితంతువుల గతి చెప్పశక్యమే కాదు. ఎవరి గతి వారిదే అనే పశుప్రవృత్తి ఎచటచూచినా తాండవమాడుతోంది! ఆకలి చేయజాలనిది యేముంది?

తల్లులు తిండిలేక అల్లాడటం చూడలేక తమచేతులతోనే పిల్లలను చంపివేస్తున్నారు. కొందరు పిల్లల్ని వారి గతికి వారిని వదలి పారిపోతున్నారు. అలాంటి అనాధ బాలబాలికలను అనేకమందిని చూచాను. కరువుతో పాటు వ్యభిచారం కూడ ఎక్కువవుతోంది. కలకత్తాలో కనపడిన అనాధులలో ముసలివాళ్ళు, పిల్లలు ఉన్నారేగాని యువతులు చాల తక్కువగా కన్పించారు. యువతులు వ్యభిచారగృహాలకు ఆహూతిఅవుతున్నారు. కొన్ని రోజులు కలకత్తా వీధులలో తిండిలేకుండా తిరిగాక తల్లి పిల్లలను పోషించడానికి తానే కూతుర్ని లేక కోడల్ని వ్యభిచారగృహానికి అప్పగించుతోంది.

కొంత జాగ్రత్తగా ఏముసలమ్మగాధనైనా తెలిసికొంటే ఆమే ఈవిషయమై చెబుతుంది. పిల్లలను పస్తుపెట్టలేక కూతుర్ని వేశ్యలకు అప్పగించానని ఆమే అంగీకరించుతుంది. ఈవిధంగా కలకత్తావీధుల్లో తిరిగే అనాధుల్లో ప్రతి నలుగురిలో ఒక యువతి వుండివుంటుంది. అనగా 1 లక్షా 25 వేలకు 30 వేల మంది వ్యభిచారగృహాల పాలబడి ఉంటారు.

మానవత్వమే నశించుతూంది

ఒక చిటగాంగ్ కామ్రేడ్ పట్టణాలలో వ్యభిచారం అనాధులలో పూర్తిగా వ్యాపించి వుందని తెలిపాడు. అక్టోబరు 28 వ తేదీన "నేత్రకోన" క్షామనివారణ సంఘం 12 గురు బాలికలను వ్యభిచార గృహాలనుంచి రక్షించింది. వీరు ఒక్కొక్కరు 10 అణాలు మొదలుకొని రు. 1-8-0 వరకు అమ్మబడినవారు.

ఈరిపోర్టు లన్నిటిని ఒకసారి పునరాలోచించుతూంటే మానవస్వభావం యెలా పతనమవుతోందో తలపుకు వచ్చి బుర్ర తిరిగిపోతుంది. నాకే అంత ఆవేదనగా వుంటే యీ కష్టాలను అనుభవించుతున్నవారు ఎంతఘోరమైన బాధపడ్డారో వూహించడం సాధ్యమా? తలిదండ్రులను గోల్పోయి బిత్తర చూపులు చూస్తున్న అనాధ బాలబాలికలు, వీధులలో రోడ్లపై పరుండి శూన్యాకాశంవైపు చూపులు నిగుడ్చివుంచిన స్త్రీలు—యీవిషయాలన్నీ తలపుకు వస్తే ఎవరికి వళ్ళు జలదరించదు!

ఈ దృశ్యాలను నిత్యం చూస్తున్న బెంగాలీ ప్రజల స్థితిఏమిటి? వారి రక్తం ఉడుకెత్తుతుంది. కాని క్రమంగా దీనికి అలవాటుపడిపోతున్నారు. ప్రభుత్వాన్ని (మిగతా 7 వ పేజీ)

మానవత్వాన్నే మంటగలుపుతూంది బెంగాల్ కరువు

●

(6 వ పేజీ తరువాయి) తిడతారు. నిస్సహాయులై వూరుకుంటారు. కాంగ్రెసు, ముస్లింలీగ్, మహాసభవంటి సంస్థల, ప్రజానాయకులే విభేదాలతో కీచులాడుతూంటే సామాన్యులేమి చేయగలరు? బెంగాల్ నాగరిక జీవిత పునాదులే కదలిపోయే ఈ ప్రమాదాన్ని ఎదుర్కోడానికి ఐకమత్యం కావాలి. ఇలాంటి సమయంలో పార్టీ కక్షలంటే, నిజంగా బెంగాలులో మానవులు మనుష్యత్వాన్నే కోల్పోతున్నారాఅనిపించుతుంది.

ఉచిత భోజన శాలలు

ప్రభుత్వ లెక్కల ప్రకారం నేడు బెంగాలు అంతటా 5442 ఉచిత భోజనశాలలున్నాయి. అనగా 90 వేల గ్రామాలలో 15 కు ఒకటి చొప్పున మాత్రమే భోజనశాలల వుందన్న మాట. అందరికి గంజి అయినా అందేటట్లు చేయాలంటే వీటిని 15 రెట్లు వృద్ధిచేయాలన్న మాట. ఈ భోజనశాలలో 3621 శాలలను ప్రభుత్వం నడుపుతోంది. 1247 ప్రభుత్వ సహాయంతో నడుపబడుతున్నాయి. 574 ఇతరులచే నడుపబడుతున్నాయి.

వీటిలో మొత్తం 20,78,886 మంది అనాధులకు గంజిపోయబడుతూంది. అనగా బెంగాల్ జనాభాలో ముప్పది మందికి ఒకరు నేడు అనాధులయ్యారన్నమాట. కలకత్తాలో 25 కి ఒకడు అనాధుడయ్యాడు. చిటగాంగ్‌లో ప్రతి 21 రికి ఒక అనాధుడున్నాడు. వైస్రాయి చూచివచ్చిన కాంటాయ్‌లో ప్రతి యిద్దరికి ఒకడు అనాధుడుగా వున్నాడు.

ఈ భోజనశాలలలో పెట్టే తిండి ఏమిటి? గంజి! బియ్యం, సజ్జలు- పప్పు కలిపి కాచిన గంజి, కొన్నిచోట్లసజ్జలుండవు, కూరగాయలు కలుపుతారు. వీటిలో రోజుకు ఒక్కసారి మాత్రమే పెడతారు. అదీ పాపం ఆ అనాధులకు కడుపునిండా దొరకదు. అందుచే ఉచిత భోజన శాలలు యీ అనాధులను రక్షించజాలవు- చావును వాయిదామాత్రమే వేస్తాయి. స్మశానానికి మరోమెట్టు మాత్రమే.

రోగాలు, అంటువ్యాధులు

ఉపవాసాలువుండటం, ఆకు అలం తినడం వల్ల జీర్ణకోశ సంబంధమైన జబ్బులు అనేక మంది కొచ్చాయి. అజీర్ణం, రక్తవిరోచనాలు సర్వవ్యాపితంగా వున్నాయి. వాపులు, రసి కారుతున్నపుండ్లు, దుర్వాసన సర్వసాధారణం. అన్నిచోట్లకంటే కలకత్తాభోజనశాలలు మెరుగు. అలాంటి కిడ్డర్‌పూర్ ప్రాంతంలోనే అనాధులలో నూటికి 50 మందికి సంజూన్యాధి ప్రవేశించిందని డాక్టరు చెప్పాడు.

కొన్ని జిల్లాలలో అపుడే కలరా వ్యాపించింది. రాష్ట్రమంతా ఇది వ్యాప్తిచెందే ప్రమాదముంది. మలేరియా బెంగాల్‌లో సర్వసాధారణం. శక్తి వుడిగిన ప్రజలకు దానిని తట్టుకోడం అసంభవం. అందుచే మలేరియా విషమరూపం దాల్చుతోంది.

ఒక రోజున డాక్టర్ నారాయణరాయ్‌తో చర్చించాను. ఇదివరకు అతనికి వచ్చే కేసులలో 20 కి ఒకటి ప్రమాదస్థితిలో వుండేది. ఇపుడు 20 లో 19 ప్రమాదకరమైన కేసులుంటున్నాయని చెప్పాడు. ఆహార సంక్షోభం భయంకరమైన కొలదీ సరిపోయినంత వైద్య సహాయం దుర్లభమవుతుందనితెలియజేశాడు.

కాలచక్రం

కరువు నుంచి రోగం; రోగం నుంచి మరణం - ఇదే వరుస. అనాధుల సంఖ్య పెరుగుతోంది. అంటువ్యాధులు వ్యాపించుతున్నాయి. మరణాలసంఖ్య హెచ్చుతోంది.

కలకత్తాలో రోజుకు సగటుచావులు 550, నేడు 2000 మందిమరణించుతున్నారు. హాస్పిటల్‌లో చేరినవారిలో రెంటికి ఒకరు చస్తున్నారని పత్రికలే వ్రాశాయి. స్టేట్స్‌మన్ పత్రిక బెంగాలంతటా వారానికి 10 వేలకు పైగా కరువువల్ల చస్తున్నారనీ, మరణాల సంఖ్య 40 వేలదాకా వున్నాయంటవచ్చుననీ కూడా ఒప్పుకుంది. పండిట్ కుంజ్రూ వారానికి 50 వేలు మరణించుతున్నారని వేసిన అంచనా సరియైనదని నేననుకొంటున్నాను.

ప్రభుత్వం కరువు మరణాల మొత్తం సంఖ్యను ప్రకటించలేదు. నాఅంచనాప్రకారం డిశెంబరు ఆఖరుకు 50 లక్షలు మృత్యువాతబడతారనుకొంటున్నాను. జూలై నుంచి రెండున్నర కోట్ల వ్యవసాయకూలీలు, బీదరైతులు ఆకలితో మాడుతున్నారు. వీరిలో 50 లక్షలు పిల్లలు వృద్ధులే వుంటారు. అందువే నా అంచనాలో అతిశయోక్తి ఏమీలేదు.

డిశెంబరు పరిస్థితులు బాగుచేయనిచో, శీతాకాలపు పంటను తిండి దొంగల చేతుల్లోకి పోనివ్వకుండా కంట్రోలు చేయనిచో, పరిస్థితులు మరీ అధ్వాన్నమవుతాయి. బెంగాల్ ప్రజలను భీషణ ప్రమాదం ఎదుర్కొంటూంది.

బెంగాల్ రక్షణకు నడుం బిగించాలి

బెంగాల్ ప్రమాదం మనందరికి ప్రమాదమే! బెంగాల్ ప్రజలు కరువు, అంటువ్యాధులతో కృశించి నశించుతూంటే అంతటితో ఆగదు. దేశమంతటా వ్యాపించుతుంది. నేడు బెంగాల్‌కు మనం సాయం చేయనిచో ఆగతే రేపు మనకుకూడా పడుతుంది.

బెంగాలులో కరువు కొనసాగన మంటే జపాన్ దండయాత్రకు అవకాశమివ్వడమన్న మాట. కరువు, చావులు, నిరుత్సాహం వీటి కంటే జపానుకు కావలసిందేమిటి? అది యీ అవకాశాన్ని జారవిడచేటంత తెలివి తక్కువదికాదు! జపాన్ఏజంటు బోసు తన కేంద్రాన్ని సింగపూర్‌నుంచి రంగూన్‌కు మార్చాడు. చిటగాంగ్ మీదుగా దండయాత్ర చేస్తామని బెదరించుతున్నాడు.

బెంగాల్‌ను కరువుతో మ్రగ్గనివ్వడమంటే, దేశ మంతటినీ క్షామదేవతకు అప్పగించడమన్నమాట; జపాన్ దుండగీడుల దండయాత్రకు అవకాశ మివ్వడమన్నమాట

భారతదేశంకొరకు ప్రతిభారతీయుడు బెంగాలును రక్షించడానికి కృషిచేయాలి.

మనకుటుంబాలయెడ ప్రేమకు చిహ్నముగా బెంగాల్ కుటుంబాలను విచ్ఛిన్నం గాకుండా కాపాడాలి. మన సోదరీమణుల గౌరవాన్ని కోరేవారమయితే, బెంగాల్ సోదరీమణుల గౌరవాన్ని కాపాడాలి. మన పిల్లల క్షేమంకొరకే బెంగాల్ పిల్లలను మృత్యుముఖాన్నుంచి రక్షించాలి.

మన భారతదేశాన్ని మనం ప్రేమించితే, బెంగాల్‌ను మనం రక్షించాలి. బెంగాల్ నశించాక భారతదేశం జీవించలేదు.

ఇదే నేటి బెంగాల్ నిజస్థితి. ఆరువారాలు బెంగాల్ ప్రజల బాధలు చూచాక యీకృతనిశ్చయంతో తిరిగివచ్చాను. భారతదేశభక్తులందరూ విభేదాలను మరచిపోయి, ఐకమత్యంతో బెంగాల్‌ను రక్షించడానికి నడుములు బిగించాలి. ప్రతి పురుషుడు, స్త్రీ, బాలుడు, బాలిక తను చేయగలిగినంత సాయం బెంగాలుకు చేయాలి.

★

బెంగాల్ పీపుల్స్ రిలీఫ్ కమిటీ

—ఈ కమిటీకి యే రాజకీయ పార్టీతోను సంబంధం లేదు. ఏ కుల, మత, సంస్థకు చెందినది కాదు. దీని శాఖలు బెంగాల్‌రాష్ట్రమంతటా ఉన్నాయి.

—దీనికి ఆహార కమిటీల ద్వారా ప్రతి జిల్లాతోను సంబంధాలు ఉన్నాయి.

— శీతకాలం ప్రవేశించినప్పటినుంచీ ఈ కమిటీ కరువు బాధితుల సహాయార్థం ప్రతి బట్టల మిల్లుకు విజ్ఞప్తి చేసింది.

— కలరా, టైఫాయిడ్, మలేరియా, మొదలయిన రోగాలతో బాధపడే ప్రజలకై యీకమిటీ ఔషధసహాయాన్ని కోరుతూంది.

మీరు బెంగాల్ కరువు నివారణకై చేయగలసహాయాన్ని ఈకమిటీద్వారానే చేయండి:

బెంగాల్ పీపుల్స్ రిలీఫ్ కమిటీ,
62, బౌబజార్ స్ట్రీట్, కలకత్తా.



పుక్కెడు గంజికోసం ఎదురుచూస్తున్న అభాగ్యులు

(8 వ పేజీ తరువాయి) కూడా మానాలి. ఎందువల్లనంటే, గురివిందగింజ తన కింది నలుపు యెరుగదట!

రేపు కోతలలో రాబోయే పంటను అమ్మవద్దని రైతులలో మీరుచేసేప్రచారంమానండి. మీ ప్రచారం జయప్రదమైతే, లీగ్ మంత్రివర్గంకూలిపోవడంనిజమేగాని, దానిప్రతికక్షులు కూడా అధికారానికి రావడం దుర్లభం. నిరంకుశాధికారులే బెంగాల్‌లో పరిపాలన సాగిస్తారు. రాష్ట్రం యిప్పటికంటే అనేకరెట్లు భయంకరమైన కరువుకు గురి అవుతుంది. పోలీసుల సహాయంతోను, సైనికుల సహాయంతోను, ధాన్యాన్ని దౌర్జన్యంగా కమాండీర్ చేస్తారు. అగస్టు 9 సంఘటనల సందర్భంలో తాండవమాడిన నిర్బంధవిధానం వంటిదే మళ్ళీ బెంగాల్‌లో తాండవమాడుతుంది. పట్టణాలలోని పేద ప్రజలు పల్లెటూళ్ళ మీద పడతారు. పల్లెటూళ్ళలో కూడా దోపిళ్లు జరుగుతాయి. రాష్ట్రం అంతటా మార్షల్‌లా ప్రవేశ పెట్టబడుతుంది. ప్రతి మూల అంతర్యుద్ధం చెలరేగుతుంది.

ఏది పరిష్కార మార్గం?

నేటి లీగ్ మంత్రివర్గాన్ని వ్యతిరేకించే పార్టీలు వెంటనే పరిస్థితుల్ని బాగుపరచడానికి ఇప్పటికైనా అవకాశంవుంది. మంత్రివర్గం యెడల అవలంబిస్తూన్న విచ్ఛిన్న పంథాను విడిచిపెట్టి లీగ్‌తో సహకారం చేయవలసి వుంది. ఇది సంయుక్త మంత్రివర్గ స్థాపనకై తోడ్పడుతుంది.

బెంగాల్ రాష్ట్రంలోని ప్రధానరాజకీయ పార్టీలు తమ ప్రజల్ని గురించి, వారిని కరువునుండి రక్షించడాన్ని గురించి, ఆలోచిస్తారా? లేక తమ తమ నిల్వవ్యాపారస్తులచే ఇప్పటి మాదిరిగానే పురిగొల్పబడుతూ, శత్రుపక్షాలపై యుద్ధం కొనసాగిస్తూ వుంటారా? బెంగాల్ జీవించడమా, లేక నశించడమా? అనే సమస్య యీ ప్రశ్నకు జవాబుపై ఆధారపడి వుంటుంది.

ప్రస్తుత పరిస్థితులలో, లీగ్ - హిందూ మహాసభల ప్రతినిధులు గలిగి, కాంగ్రెస్, కమ్యూనిస్టులు బలపరచేటట్టి మంత్రివర్గం బెంగాలులో అవసరం. బెంగాలులో వున్న అన్ని పార్టీల దేశభక్తులు నేడు నెరవేర్చవలసిన కర్తవ్యం ఏమంటే: డాక్టరు శ్యామ్ ప్రసాదుకు లీగ్ మంత్రివర్గం హృదయపూర్వకమైన సహకారం ఇచ్చేటట్లుచేయడం; అట్టి సహకారాన్ని డాక్టర్ శ్యామప్రసాద్ అంగీకరించేటట్లు ఒప్పించడం.

బెంగాల్ కరువు - వివిధపక్షాల వైఖరి

★

(5 వ పేజీ తరువాయి) కేంద్ర ప్రభుత్వంపై ఎలా ఆధారపడిందో, అలాగే బెంగాల్ రాష్ట్రంలో పండిన సరుకు సప్లయికొరకు ముస్లిం నిలవవ్యాపారస్థులపై ఆధారపడింది, లీగ్ మంత్రివర్గం. "ఇస్పహానీ" అను ముస్లిం వ్యాపారస్తుని సంస్థకు ఛీఫ్ ఏజన్సీ యిచ్చింది. "ఇస్పహానీ" వేసిన ప్లాను యేమంటే, కొందరు హిందూ వ్యాపారస్తుల్ని సబ్ ఏజంట్లుగా నియమించి, వారిద్వారా జులై - ఆగస్టు పంటను కొన్నట్లయితే, స్థానికాధికారుల సాయంతో కావలసినంత లాభం సంపాదించవచ్చు; అందులో కొంత హిందూ వ్యాపారస్తులకు యివ్వవచ్చు. కాని, యీ అంచనాను హిందూ నిలవ వ్యాపారస్తులు తలక్రిందులు చేశారు. మార్వాడీ ఛేంబర్ ఆఫ్ కామర్సు, నేషనల్ ఛేంబర్ ఆఫ్ కామర్సు, ఇండియన్ మర్చంట్సు ఛేంబర్ అనే మూడు సంస్థల వ్యాపారస్థులు కలిసి, ఒక్కుమ్మడిగా "ఇస్పహానీ" మీద విరుచుకు పడి, పంటనంతా తామే కొని, ఆగస్టులో ధరల కంట్రోలు ప్రవేశపెట్టబడగానే, సరుకు నంతనూ దాచివేశారు. ఈ విధంగా, ముస్లింలీగ్ మంత్రివర్గం ముస్లిం వ్యాపారస్తులపై ఆధారపడ్డంవల్ల ఏమాత్రం సరుకు లభించకపోగా, హిందూ వ్యాపారస్తుల శక్తిఅంతా మంత్రివర్గానికి వ్యతిరేకంగా కేంద్రీకరించబడింది. పట్టణాలలో రేషనింగును ప్రవేశపెట్టాలంటే, సరుకేదీ? అంతా దొంగమార్కెట్లోకి మాయమయింది.

యూరపియన్ల వోట్లు

మూడవకారణం, సంయుక్త మంత్రివర్గ స్థాపనకై లీగ్ మంత్రివర్గం చేసిన ప్రయత్నాలు విఫలంకావడంవల్ల అది యూరపియన్ శాసన సభ్యుల వోట్లమీదనే పూర్తిగా ఆధారపడవలసి వచ్చింది. ఈ పంథావల్ల తనకూ, తన రాష్ట్రానికి, తీరని హాని కలిగింది. రాజకీయంగా ఆలోచిస్తే, జాతీయశక్తుల ఐక్యతపై యీవిధానం దెబ్బకొడుతుంది. ఆర్థికంగా ఆలోచిస్తే, ధరల కంట్రోల్ నామమాత్రంగానే ఉండిపోతుంది. బెంగాల్లో యూరపియన్లు పరిశ్రమలతో బాటు వ్యాపారంలోకూడా విరివిగా పాల్గొంటారు. అందువల్ల ధరల కంట్రోలును వీరు తీవ్రంగా ఎదుర్కొన్నారు. ఇంతేగాక, యూరపెయన్లు లక్షలకొద్ది కార్మికుల్ని నియమించి పనిచేయించుకుంటారు. చాలకాలం క్రిందట వీరు చౌక ధరలకు బియ్యం కొని స్టాకుచేసుకున్నారు. వాటిని తమ కూలీలకుకొద్దిగా యెక్కువ ధరలకమ్ముకోవచ్చునని వారలాచేశారు. కాని, నేడు అప్పటి కంటె నాలుగురెట్లవరకు ధర పెరిగిపోయింది! వెంటనే వీరు పాతసరుకును బయటికి తీసి, దొంగమార్కెట్లో విపరీతపు ధరలకమ్మి, లక్షలకొద్దీ లాభాలు సంపాదిస్తున్నారు.

కాబట్టి, ముస్లింలీగ్ మంత్రివర్గం తిండి దొంగలపై ఆధారపడి యున్నంతకాలం కరువుసమస్యను పరిష్కరించడం సాధ్యం కాదని స్పష్టమయింది.

డాక్టర్ శ్యామప్రసాద్ నినాదాలు

ఇక లీగ్ మంత్రివర్గాన్ని దుమ్మెత్తిపోసే డాక్టర్ శ్యామప్రసాద్ ముఖర్జీ నినాదాలేవో చూదాం. లీగ్ మంత్రివర్గం జీవించియున్నంత కాలం పరిస్థితులు బాగుపడవని యితడు వాదిస్తాడు. నిరంకుశాధికారుల కీలుబొమ్మ అయిన మంత్రివర్గాన్ని ఎలాగైనా కూలదోయడమే తక్షణం చేయవలసినపని అంటాడు. ఇందు కతడు చూపేమార్గం ఏమిటి? లీగ్‌మంత్రివర్గం సరుకునుకొనడంలోను, సరఫరా చేయడంలోను, గావించే యేర్పాట్లన్నింటిని భగ్నమొనరించాలి! ఈ విధంగా లీగ్ మంత్రివర్గం ప్రజల్ని పోషించలేకుండా పోతుంది; ఇది దాని శీఘ్రపతనానికి దారితీస్తుంది! అయితే ఈ హేతువాదం ఎక్కడికి దారితీస్తుందో చూదాం. ఈవేళ ప్రజలు తిండిలేక ప్రాణాలు విడుస్తారు; విడిస్తే విడిచారు; రేపు లీగ్ మంత్రివర్గాన్ని సులభంగా కూలద్రోయవచ్చు!

ఇంతవరకూ శ్యామప్రసాద్ తన ప్రయత్నాలలో సఫలుడు కావడానికి కారణం యేమంటే, బెంగాల్‌రాష్ట్రపు ఆర్థికనిర్మాణంలో హిందూ వ్యాపారస్తులదే పైచేయి.

బాధపడేది యెవరు?

రైతులెవరూ తమ పంటను ప్రభుత్వ ఏజంట్లకు అమ్మవద్దని ఈయన ప్రచారం. గ్రామస్తులు సరుకును అమ్మకపోతే, పట్టణాలలో రేషనింగ్ ఎలా సాధ్యమౌతుంది? సరుకును అమ్మకపోతే, అందరికంటె యెక్కువ బాధపడే దెవరు? హిందువులైన మధ్య తరగతి ప్రజలు, పట్టణాలలో నివసించే పేదలు. రైతు తన నిత్యజీవితావసరాలకై సరుకును అమ్మకపోతే యెలాగు? ప్రభుత్వ ఏజంట్లకు అమ్మకపోతే, ఇంకెవరికి రైతు అమ్ముకోగలడు? నిలవవ్యాపారం చేసే తిండి దొంగలకేగదా! కాబట్టి, డాక్టరు శ్యామప్రసాద్ అవలంబించే పాలసీవల్ల అసలే అధ్వాన్నంగాఉన్న పరిస్థితులు ఇంకా అధ్వాన్నమౌతాయి. బెంగాల్ హిందువుల కీపాలసీ యేవిధంగాను సహాయపడదు; హిందూ తిండిదొంగలకు మాత్రం కావలసినంతసహాయం చేస్తుంది!

ఇంత వినాశకరమైన పంథా ఎందుకు హిందూ ప్రజాసామాన్యపు ఆమోదాన్ని పొందుతూంది? కరువు బాధితుల సహాయనిధిని విరివిగా పోగుచేసి, దానిద్వారా తన ప్రతికక్షుల్ని ఎదుర్కోవడంవల్ల. "నిరంకుశాధికారులు మన ఆహారాన్ని సైన్యంకొరకు, ఎగుమతుల కొరకు, లాక్కున్నారు. వీరికి లీగ్‌మంత్రివర్గం దాసోహం చేస్తూంది. ఇక మేము ప్రజల్ని ఎంతవరకు కాపాడగలమో అంత వరకు సహాయనిధిని వసూలుచేసి ఖర్చుపెడతాం." ఈవిధంగా కరువునిధిని వసూలుచేసి ఖర్చుపెట్టడంద్వారా శ్యామప్రసాద్ తన విచ్ఛిన్న కార్యక్రమాన్ని మరుగు పరచుకోగలుగుతున్నాడు. పోనీ, ఈ రిలీఫ్ కార్యక్రమమైనా అందరినీ ఐక్యతపై పు తీసుకొస్తూందా? అంటే అదీలేదు. పూర్తిగా విచ్ఛిన్నానికే తోడ్పడుతూంది. డాక్టర్ ముఖర్జీ నాయకత్వంతో నిర్వహించబడుతూన్న కమిటీలో ముస్లింలీగ్‌కు స్థానంలేదు. కమ్యూనిస్టుపార్టీ విషయంకూడా యింతే. కమ్యూనిస్టు పార్టీలో ఉన్న హోల్‌టైమర్ల (అనగా, ఎల్లకాలం పార్టీ కార్యక్రమాన్ని నెరవేర్చేవారు) సంఖ్య ఇతర పార్టీల హోల్‌టైమర్ల సంఖ్య కంటె పెద్దదైనప్పటికీ, వారి సహాయం డాక్టర్ ముఖర్జీకి అవసరంలేక పోయింది. కారణం డాక్టర్ ముఖర్జీ యొక్క రాజకీయ పంథాను కమ్యూనిస్టులు అనుసరించకపోవడమే.

రిలీఫ్‌కిచెన్లలో పంచమాంగదళం!

ఇక, డాక్టర్ శ్యామప్రసాద్ స్థాపించిన రిలీఫ్ కిచెన్లను నడిపే దెవరో చూదాం. కూలి యిచ్చి తీసుకొచ్చినవారు, ఫార్వర్డుబ్లాకు-అనుశీలన్ సమితి వంటి పంచమాంగదళం సంస్థలకు చెందినవారు. నేటి బెంగాల్ ఆహార సమస్యను పరిశీలించదలచుకొన్న దేశభక్తులు యీ విషయాన్ని జ్ఞాపకం ఉంచుకోవడ మవసరం.

డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ బ్రిటిష్‌ప్రభుత్వాన్ని దుమ్మెత్తిపోయడానికి ఇచ్చే నినాదాలు పంచమాంగదళానికి ఎంతో చక్కగా ఉపయోగపడుచున్నాయి. బెంగాల్లో పండిన పంట అంతా సైన్యంవద్ద, మధ్యప్రాచ్య దేశాలలోను, మూలుగుతోందని ప్రజల్ని నమ్మించగలిగితే, "మన బియ్యాన్ని బ్రిటిష్‌వాళ్లు దోచుకుపోయారు. అడుగో! బోసు బర్మా బియ్యంతో రాబోతున్నాడు రండి సన్మానిద్దాం," అని వెంటనే ఒప్పించవచ్చు.

మరో విషయం: రిలీఫ్ కిచెన్లలో అసంఖ్యాకమయిన పేద ప్రజ లున్నారు. వారిమధ్య పంచమాంగదళం ప్రవేశించి, సంబంధాలు పెట్టుకొంటూంది. దోపిళ్ళుగాని, తిరిగి మళ్ళీ విధ్వంసకచర్యలుగాని, కొనసాగించబడడానికి యీ సంబంధాలు తోడ్పడుతాయి.

లీగ్ మంత్రివర్గాన్ని కూలద్రోయడానికి ప్రయత్నిస్తూన్న శ్యామ్‌ప్రసాద్ ముఠా ఎంత హానికరమైనమార్గం తొక్కుతూందో ఈసారి స్పష్టంగా తెలుస్తూంది. నాయకత్వం శ్యామ్‌ప్రసాద్‌ది; ధనసహాయం చేసేది హిందూ నిలవవ్యాపారస్థులు. కేడర్లను సప్లయి చేసేది పంచమాంగదళం. ఈవిధంగా, విచ్ఛిన్నకులు-లాభసాటిబేరగాళ్ళు-దోశద్రోహులు ఒకేకూటంలో చేరి పనిచేస్తున్నారంటే, ఎంత ఆశ్చర్యం కలుగజేస్తుంది!

కాంగ్రెసు నాయకత్వం

బెంగాల్ రాజకీయంగా విచ్ఛిన్నమై, ఆర్థికంగా మాడిపోతూంటే, కాంగ్రెసు నాయకత్వం ఏమిచేస్తూందో చూదాం.

లీగ్ మంత్రివర్గానికి వ్యతిరేకంగా డాక్టర్ శ్యామప్రసాద్ చేసే ప్రచారం క్రమంగా యెక్కువౌతూన్నకొద్దీ, కాంగ్రెసు నాయకత్వం తటస్థంగాఉంది. ఇందువల్ల కాంగ్రెస్ ప్రజా సామాన్యం అంతా హిందూమహాసభ నాయకత్వం కిందికి పోయింది. డాక్టర్ ముఖర్జీ కార్యక్రమమే కాంగ్రెసు కార్యక్రమం అని ప్రజలు విశ్వసించారు.

క్రిందటి నెలలో ఆర్థర్‌మూర్ బెంగాల్ దేశభక్తులకు చేసిన ఐక్యతా విజ్ఞప్తికి శ్రీ కిరణ్‌శంకరరాయ్ జవాబిస్తూ, నాయకులు విడుదలకాబడి జాతీయప్రభుత్వం స్థాపించబడే వరకు కాంగ్రెసు ఏమీచేయదని తెలియజేశాడు. రాష్ట్రమంతట కరువు రాకాసి తాండవమాడుతున్నపుడు బెంగాల్ కాంగ్రెసు నాయకులు గోళ్ళు గిల్లుకుంటూ కూర్చుంటే, జాతీయప్రభుత్వం ఎలా వస్తుందో వారికే తెలియాలి. కాంగ్రెసుగాని, ముస్లింలీగ్ గాని, మంత్రివర్గానికి వ్యతిరేక పార్టీలు గాని, ఐక్యకార్యాచరణకు ముందడుగు వేయకపోతే, మన దేశానికి జాతీయ ప్రభుత్వం రాదుసరిగదా, బెంగాల్ కరువే దేశానికంతకూ వ్యాపిస్తుంది.

క్రమంగా పరిస్థితులు యింకా విషమించాయి. కాని, కిరణ్‌శంకరరాయి కదలలేదు. పైగా, స్వేచ్ఛా వ్యాపారంవల్ల కరువు నిర్మూలనమవుతుందని ఆయన ఢక్కాలో యీమధ్య ఉపన్యసించాడు. అనగా, నిలవ వ్యాపారస్తులకు సంపూర్ణమైన స్వేచ్ఛ అన్న మాట. ఈవిధంగా, బెంగాల్ కాంగ్రెసు నాయకత్వం కరువునివారణకై రాష్ట్రీయ ప్రజలందరినీ ముందుండి నడపడానికిబదులు, ధరల కంట్రోలుకు వ్యతిరేకంగా నినాదమిస్తోంది. హక్ మంత్రివర్గం అధికారంలో ఉన్న రోజులలో స్వేచ్ఛా వ్యాపారం వల్ల మణుగు రు 38 వరకు యెలా పెరిగిపోయిందో అందరికీ తెలిసినవిషయమే. అస్సాం - ఒరిస్సా, బీహార్ రాష్ట్రాలలో స్వేచ్ఛా వ్యాపారం ప్రవేశపెట్టబడిన తరువాత ఆ రాష్ట్రాలలో బెంగాల్ రేట్లే అమలులోకి వచ్చిన విషయంకూడా తెలిసిన విషయమే. ఇప్పుడు మళ్ళీ స్వేచ్ఛావ్యాపారం ప్రవేశపెట్టబడితే, బెంగాల్ సర్వనాశనం అవుతుంది. అంతేకాదు, ఇతర రాష్ట్రాలన్నింటికీకూడా కరువువ్యాపించుతుంది.

విచ్ఛిన్నపోకడలకుస్వస్థిచెప్పండి

బెంగాల్ మంత్రివర్గం ఒక్క విషయాన్ని మరచిపోకూడదు. కొద్దిగా పండిన జూలై పంటనే ప్రజల కందించలేనప్పుడు రేపు డిసెంబరులో కోతకువచ్చే శీతకాలపు పంటను ఏవిధంగా అందించగలుగుతారు? ముఖ్యంగా మీప్రతికక్షులు రైతుల్ని అమ్మవద్దని పురిగొల్పుతూన్నప్పుడు మీరు చేయగలిగిన దేమీఉండదు. ఏఒక్కపార్టీ అధికారంలో వున్నా, యీ సమస్యను పరిష్కరింపజాలం. దేశభక్తిగల రాజకీయపార్టీలన్నీ కలిసి, సంయుక్తమంత్రివర్గాన్ని స్థాపించి, తిండిదొంగలకు వ్యతిరేకంగా ప్రజలందరినీ సమీకరించిననాడే, నిలవవ్యాపారస్థుల దోపిడీని అరికట్టగల్గుతాం.

తిండిదొంగలపై ఆధారపడుతూ, కేంద్రప్రభుత్వంవైపు అర్రులుచాచి కూర్చుంటే కరువు సమస్యను పరిష్కరించవచ్చుననే భ్రమను బెంగాల్ మంత్రివర్గం విడిచిపెట్టాలి. లేకపోతే, దేశభక్తిగల హిందూ ప్రజాసామాన్యం యొక్క సహకారం లభించదు. ముస్లిం ప్రజాసామాన్యానికి కూడా దూరం కావలసి వస్తుంది. ఎందువల్లనంటే, యెవరికి తిండి లభించదు, యిట్టి పాలసీవల్ల.

ఈమధ్య షుర్వార్దీ (మంత్రి వర్గంలో సభ్యుడు) ఒక ఉపన్యాసంలో రేపు రాబోయే శీతకాలపుపంటను ఐక్యఆహారకమిటీలద్వారా కొనడానికి ఏర్పాట్లు జరుగుతూన్నట్లు తెలియజేశాడు. నజీముద్దీన్ (ప్రధానమంత్రి) అఖిలపక్ష ఆహార సలహాసంఘాన్ని నిర్మించుటకు సన్నాహాలు చేస్తున్నట్లు "స్టేట్సుమన్" పత్రిక వ్రాసింది. త్వరలో యిట్టి సలహాసంఘాన్ని స్థాపించి, సంయుక్త మంత్రివర్గ స్థాపనకై ప్రయత్నాలు ప్రారంభిస్తే, బెంగాల్ రాజకీయాలలోని అంతర్యుద్ధం తొలగగలదు, కరువు సమస్య జయప్రదంగా పరిష్కరించబడగలదు.

వివిధ రాజకీయ పార్టీలలో ఐక్యత లేకపోతే, స్వార్థపరులైన నిలవవ్యాపారస్తులదే పైచేయి అవుతుంది. వివిధ పార్టీలు ఐక్యతను సాధించగలిగితే, ఆ యా పార్టీలకు చెందిన ప్రజాసామాన్యానిది పైచేయి అవుతుంది. నిలవ వ్యాపారస్తుల కోర్కెలు, ఆశయాలు, ఒకేవిధంగా ఉండవు; అనేక వైరుధ్యా లుంటాయి. అందువల్ల, రాజకీయ విభేదాలు రాజకీయ విచ్ఛిన్నానికి దారితీసేలాగు వీరు చేయగల్గుతారు. కాని ప్రజల కోర్కెలు, ఆశయాలు ఒకే విధంగా ఉంటాయి; వైరుధ్యాలుండవు. అందువల్ల, వివిధ పార్టీలమధ్య సాధించబడు ఐక్యతను వీరు జాగ్రత్తగా కాపాడుతారు.

అందరూ కలిసిరండి!

మంత్రివర్గాన్ని వ్యతిరేకించే పార్టీలకు నా విజ్ఞప్తి యేమంటే: నేరం అంతా లీగ్ మంత్రివర్గంమీద తోయకండి. హక్ మంత్రివర్గపు రోజుల్లోనే బియ్యంధర రు. 6 నుండి రు. 24 లకు పెరిగిందనే విషయాన్ని మరువరాదు. ఆ మంత్రివర్గం రాజీనామా యిచ్చేసరికి బెంగాల్‌లో సరుకు పూర్తిగా నిండుకుందనే యదార్థాన్ని జ్ఞాపకం ఉంచుకోవాలి.

లీగ్ మంత్రివర్గం లంచగొండి మంత్రివర్గం అని నిందించడం (మిగతా 7 వ పేజీలో)

కాలేపొట్టకు ఆకలిబాధ తెలుసు

●

క్షామంఅంటే అనుభవమున్న కర్నూలు జిల్లా ప్రజలు సోదర బెంగాలు రాష్ట్ర ప్రజల ప్రాణాలను రక్షించడానికి తమ కర్తవ్యాన్ని నెరవేర్చుకున్నారు. వసూలు గావించబడిన యీ దిగువ మొత్తాలు 'బెంగాలు పీపుల్సు రిలీఫ్ కమిటీకి, కలకత్తా మహిళా ఆత్మరక్ష సమితికి పంపబడ్డాయి.

1. కర్నూలు పట్టణంలో స్థానిక కమ్యూనిస్టుపార్టీవారు వసూలుగావించినది	322-0-0
2. .. విద్యార్థి క్షామనివారణ కమిటీ సినిమాలద్వారా వసూలు గావించనది	114-11-0
3. .. శ్రీ కామ్రేడ్స్ శ్రీల నుండి వసూలుగావించినది. గవర్నమెంటు గరల్సు హైస్కూలు ప్రధానోపాధ్యాయిరాలు వసూలు కావించినది. (యీ మొత్తం మహిళా ఆత్మరక్షసమితివారికి పంపబడింది.)	77-2-0
4. నందికోట్కూరులో బాల సంఘం వసూలు గావించనది.	8-0-0
5. వెలుగోడు స్థానిక కమ్యూనిస్టులు వసూలుగావించినది.	10-0-0
పంపబడిన మొత్తం.	రు. 531-13-0

పై మొత్తాలు పంపినతర్వాత వసూలైనది-

(కంభం తాలూకానుండి)	రు. 68-8-0
వెలుగోడు	5-0-0
నందికోట్కూరు	2-0-0
మొత్తం.	రు. 75-8-0

★

బెంగాల్ కరువు నిధి

ఆంధ్రరాష్ట్ర రైతుసంఘ ప్రధాన కార్యదర్శి- ఈ దిగువ ప్రకటన చేస్తున్నారు.

మా ఆఫీసుకు చేరిన మరికొన్ని విరాళాల జమాఖర్చులను ఈక్రిందప్రకటించుచున్నాను.

తెన్నేరు యువజనసంఘం	16— 0—0
.. నుండి	2— 0—0
కొండవరం బాలసంఘం	3— 8—0
తేలప్రోలు బాలసంఘం	4— 0—0
నెల్లూరుజిల్లా రైతుసంఘంద్వారా	55—13—6
రాష్ట్ర విద్యార్థి మహాసభనుండి తిరిగివస్తూ రైలులోవసూళ్ళు	1—14—6
ఆత్రేయపురంనుండి	4— 2—0
మోటు ఆంధ్రయువజనసంఘం	44—14—0
రావులకొల్లు బాలసంఘం	5— 2—0
మోటుగ్రామంనుండి	6— 0—0
	143— 6—0

గత రు. 2—0—0లు యీ మొత్తమున్నూ కలిపి రు. 145—6—0 లులో రు. 143-8-0లు పీపుల్సు రిలీఫ్ కమిటీ, బెంగాలుకు అసెంబ్లీ అధ్యక్షులగు నౌషేరాలీగారి పేరను పంపబడినది. మనియార్డరు ఖర్చులు రు. 1-14-0 లు మొత్తం రు. 145—6—0 లు.

బెజవాడ, 15—11—43.

★

బెంగాల్‌కు సహాయం

బెంగాల్‌లో యీనాడు తాండవించు క్షామం ప్రపంచాన్నంతటినీ కదలించివైచుచున్నది. జపాన్ హంతకుల నెదుర్కొనవలసిన బెంగాల్ ఈనాడు కరువుబాధతోకృంగి, కృశించిపోవుట దేశ క్షేమానికి, రక్షణకు ప్రాణాంతకము.

అట్టి విషమస్థితిలో వార్ టెక్నికల్ సెక్షన్సులో వుండి మన దేశాన్ని ఫాసిస్టులనుండి రక్షించుటకు తోడ్పడు బాధ్యత కలిగిన మేము మాసోదర బెంగాలీయులకు మా శక్తికొలది సహాయం చేయుట మా కనీసధర్మంగా ఎంచుచున్నాం. ప్రతి నెల మాజీతాలు రావటంతోనే కరువునిధికి వసూలుచేయుటయే గాక తక్కిన టెక్నికల్ సెంటర్సుకు వెళ్ళి వసూలుచేయ నిశ్చయించాము. కనుక మావలెనే ఆంధ్రులందరూ తమ తమ శక్తికొలది రాయలసీమ, కేరళ, బెంగాల్‌ప్రజల సహాయార్థం పంపాలని కోరుచున్నాము.

మా మొదటినెల విరాళముగా రు. 13 లు వసూలుచేసి సిటీ కమ్యూనిస్టు పార్టీ ద్వారా బెంగాలుకు పంపుచున్నాము.

ఇట్లు,
P. G. P. W. టెక్నికల్ రిక్రూటర్స్,
బె జ వా డ.

★ విద్యార్థిసంఘ విచ్ఛిన్నకుల చర్యలు ★

బాపట్ల విద్యార్థిసంఘకార్యదర్శి యీదిగువ ప్రకటన పంపారు.

ఈనెల 8 వ తేది రాత్రి కొందరు విద్యార్థి సంఘ ద్రోహులు బాపట్ల పట్టణ విద్యార్థి సంఘ ఆఫీసు తలుపులుబ్రద్దలుకొట్టి, ఆఫీసు రికార్డునుకొంతచింపారు. కొంత తగులపెట్టారు. సంఘ నిధి రు. 3-13-0 లు ఎత్తుకొని పోయారు. వెళ్ళుతూ గత విద్యార్థి సంఘ కార్యదర్శిని దూషిస్తూ, "నిన్ను చంపితేగాని పంచమాంగదళంవాడిని కాదురా" అని ఒక వుత్తరం వ్రాసి హాలులో పడవేసి వెళ్లారు. ఈ తుచ్ఛమైన పనిని విద్యార్థి సంఘ విచ్ఛిన్నకులు, దేశద్రోహులు నైన జాతీయ విద్యార్థి సంఘంలోని కొందరు దుండగీడులు చేశారనడంలో సందేహంలేదు. ఇట్టి నీచుల చర్యలను దేశభక్తులును, మర్యాదస్తులైన పౌరులందరును నిరసించుతారని ఆశిస్తున్నాను.

మరునాడు ఉదయం పట్టణంలోని పెద్దలు, కాంగ్రెసు నాయకులును ఆఫీసుకువచ్చి ఈ విషాద దృశ్యానిచూచి ఈ పనులు చేసిన నీచుల చర్యలను నిరసించారు. పట్టణంలోని ప్రముఖకాంగ్రెసువాదులును, న్యాయవాదులును అయిన శ్రీ పిల్లుట్ల హనుమంతరావుగారు పై దృశ్యాన్ని చూచిన పిమ్మట ఈ క్రిందివిధంగా ఒక ప్రకటన చేశారు.

బాపట్ల విద్యార్థిసంఘ సభ్యులకు

"కొందరి మిత్రుల కోరికమీద ఉదయం మీ ఆఫీసుకు వెళ్ళి చూచియుంటిని. రాత్రి ఎవరో దుర్మార్గులు లోనికి ప్రవేశించి ఆఫీసు రికార్డులు కొన్నింటిని కాల్చి, కొన్నింటిని బయట పారవేశారు. కొద్ది సొమ్ము కూడా అపహరింపబడినట్లు వింటిని. ఇటువంటి కార్యము యెవరోదుర్మార్గులు చేసియుండవలెననుట స్పష్టము. సంఘకార్యదర్శిని చంపెదనని బెదరించుచు వ్రాయబడిన ఒక కాగితమును కూడా చూచియుంటిని. ఇట్టి వ్రాతలు వ్రాయుట గర్హనీయమని వేరే చెప్పనక్కరలేదు. ఈపనులను నేను ఖండించుచున్నాను. రాజకీయముగ భేదాభిప్రాయాలు ఉన్నయెడల సభలు జరుపుకొని, చర్చలు జరుపుకోవచ్చును. కాని యిట్టిపనులు సభ్యతకు వ్యతిరేకముమాత్రమే గాక, దేశద్రోహము చేయుటయని కూడా నా అభిప్రాయము. అట్టివనిచేసినవారికి భగవంతుడు సరియైన త్రోవజూపి సంస్కరించేలాగున మనమందరము ప్రార్థించెదముగాక."

కామ్రేడ్ ఇవే మా జోహారులు

నవంబరు 7 వ తేదీ - ప్రపంచ చరిత్రనే మార్చివేసిన సోవియటు విప్లవ దినోత్సవం. ఈనాడు ఆరోజుకు మరింత ప్రాముఖ్యముంది. ప్రపంచాన్ని దుఃఖాంధకారంలో ముంచిన నాజీ దుష్టశక్తులను పారదోలి ఆశాజ్యోతిని చూపించుతోంది రెడ్ ఆర్మీ. ఇలాంటి సమయంలో నవంబరు 7 వ తేదీకి ప్రత్యేక ప్రాముఖ్యముంది.

అలాంటి విప్లవ ఉత్సవదినాన్ని చూడకుండా - పాల్గొనకుండా బ్రతకగలడా? కామ్రేడ్ దాసరి రంగయ్య మలేరియా జ్వరాన్ని సైతం లెక్కచేయకుండా బ్రాహ్మణకోడూరు వచ్చాడు. విప్లవ దినోత్సవంలో పాల్గొని ఇంటికి తిరిగి వస్తుండగా జ్వరం తీవ్రమైంది. చివరకు మన పద్దెనిమిదేండ్ల వీరయువకుడిని అజ్వరమేపొట్టబెట్టుకొంది. నవంబరు 8 వ తేదీన మరణించాడు.

మరణశయ్యపై వుండికూడా విచారంతో చుట్టునున్న వారిని ఉత్సాహపరుస్తూనే వున్నాడు. "కదనభూమి కేగుదాం - కత్తిదూసి దూకుదాం" అంటూ కొనవూపిరితో సైతం పాడుతూనే ఉన్నాడు.

కామ్రేడ్ రంగయ్య బాపట్ల తాలూకా పచ్చలతాడిపర్రు వాస్తవ్యుడు. పార్టీ చేస్తున్న ప్రజాసేవచే ఆకర్షింపబడి పార్టీలోచేరాడు. ఎంతో ఉత్సాహంగా పనిచేస్తూఉండేవాడు.

కామ్రేడ్ రంగయ్య శవాన్ని ఎర్రజెండాలతో అలంకరించారు. 100 మంది యువకులు దానిని ఊరేగింపు జేశారు. "ఫాసిజాన్ని నాశనంచేయడం-జాతీయనాయకులను విడుదల చేయడం - జాతీయైక్యత తీసుకురావడం - దేశరక్షణను బలపరచడం" ఇవీ రంగయ్య ఆశయాలు. వాటికోసం మనం పాటుపడదాం అంటూ నినాదాలిచ్చారు.

నవంబరు 12 వ తేదీన యలవర్తి అంకమ్మగారి అధ్యక్షతను జరిగిన బహిరంగ సభలో కామ్రేడ్ రంగయ్య జీవితాశయాలను గురించీ, అతని కుటుంబానికి సానుభూతి తెలియజేస్తూ పలువురుపన్యసించారు.

మరణశయ్యపై నుండి కూడా ఫాసిస్టులను హతమార్చమని ప్రబోధించిన, నీ ఆశయాన్ని సాధించ ప్రతిజ్ఞచేస్తున్నాం. నీకివే జోహారులు.

బాపట్ల తాలూకా కమ్యూనిస్టు కమిటీ

ఇవీ - అవీ

●

ఏలూరు తాలూకా ద్వితీయ యువజనసభ ఈ నెలమొదటితేదీనిజరిగింది. అంతకుముందు మూడు రోజులనుంచి ఆటల పోటీలు జరిగాయి. తాలూకాలో అన్ని ప్రాంతాలనుంచి 28 యువజన టీములు, 10 బాలుర టీములు పోటీల్లో పాల్గొన్నాయి. వీటిల్లో గెలిచినవారికి వెండికప్పులు, మెడల్సు బహుమతులిచ్చారు.

1 వ తేదీని యువజనసంఘ డెలిగేట్సు సభ కంభంపాటి సత్యనారాయణ (జూనియర్) గారి అధ్యక్షతను జరిగింది. దీనిలో 22 గురు ప్రతినిధులు పాల్గొన్నారు. కొత్త సంవత్సరానికి కార్యనిర్వాహక వర్గాన్ని ఎన్నుకున్నారు. శ్రీ సుంకర వెంకటరత్నం గారు అధ్యక్షులుగను, శ్రీ కట్నేని కేశవరావుగారు కార్యదర్శిగను ఎన్నుకోబడ్డారు. మరి 6 గురు కార్యవర్గ సభ్యులుగ ఎన్నుకోబడ్డారు.

ఆనాడు సాయంత్రం 200 మంది యువకులతో ఊరేగింపు జరిగినమీదట బహిరంగ సభ జరిగింది. శ్రీ పాండురంగారావు సోదరులు వ్యాయామ ప్రదర్శనాలు చేశారు. తరువాత కంభంపాటి సత్యనారాయణగారు జాతీయ అంతర్జాతీయ పరిస్థితులను గురించి విపులంగా ఉపన్యసించారు.

ఏలూరు వైజ్ఞానికదళం హరికథ వీధి భాగవతం మొదలయిన ప్రచారక పద్ధతులను ప్రదర్శించింది.

కిరసనాయిలు కరువు

వినుకొండ(గుంటూరుజిల్లా) లో కిరసనాయిలు టోకువర్తకులు తెల్లనూనెను ఇష్టులకుమాత్రమే పోస్తున్నారు. ప్రజాసామాన్యానికి అదిదొరక్క చాలయిబ్బంది పడుతున్నారు చిల్లర వర్తకులు యెర్రనూనెను రోజుకు 4, 5 సీసాలుమాత్రం పేదలకు అమ్మగలుగుతున్నారు. రేషనింగు పద్ధతిని అమలుచేసి ఈకరువును తీర్చండి. అని వినుకొండ ప్రజలు చాల ఆందోళన చేశారు. దానిమీద ఎర్రనూనె అమ్మకం టోకు వర్తకులకు, తెల్లనూనె చిల్లరవర్తకులకు మార్చారు అధికార్లు. (ఇలా చేయించినందుకు ప్రజల్ని స్త్రీపురుష విచక్షణ లేకుండా టోకు వర్తకులు నానా బూతులు తిడుతున్నారు. వెంటనే వారు తమ ప్రవర్తన మార్చుకోకపోతే ప్రజలే తగిన బుద్ధి చెప్పగలరు.) కాని దీనివల్ల సమస్య ఏమాత్రం పరిష్కారం కాలేదు. చిల్లరవర్తకులమ్మే 5, 6 సీసాలకోసం ప్రజల తొక్కిసలాట దుర్భరంగా ఉంది. రేషనింగువల్ల కావలసిన పనిని వర్తకులనుమార్చినంతమాత్రాన జరుగదు. కాబట్టి అధికారులు వెంటనే రేషనింగు అమలుజరపాలి.

సోవియట్ మిత్రమండలి స్థాపన

ఈనెల 9 వ తేదీని ఏలూరులో సోవియట్ అభిమానులందరూ కీవ్ విజయోత్సవన్ని జరిపారు. ఆసందర్భంలోనే సోవియట్ మిత్రమండలిని స్థాపించారు. ఏ రాజకీయ పక్షానికి చెందినా సోవియట్‌అభిమానియైన ప్రతివ్యక్తి ఈ సంఘంలో చేరవచ్చునని నిర్ణయించారు. సోవియట్ విజ్ఞానం, నాగరికతలను ప్రజాసామాన్యంలో విరివిగా ప్రచారం చేయడం ఈ సంఘ ఆశయం. కీవ్ విజయోత్సవ సభ డాక్టర్ రాంబాబు అధ్యక్షతను జరిగింది. పి. వి. శివయ్య, టి. కె. రామస్వామి, వేములపల్లి ఆంజనేయులు, కె. లింగరాజు మొదలైన ప్రముఖులు సోవియట్ ఆదర్శాలను గురించి, అన్ని రంగాల్లోను అది సాధించిన విజయాలను గురించి ఉపన్యసించారు.

గమనించండి

"ప్రజాశక్తి" పత్రికకు చందాలు, ఏజన్సీ బాకీలు పంపేవారుగాని, ప్రజాశక్తిప్రచురణల కోసం డబ్బు పంపేవారుగాని, రాష్ట్రకమిటీకి పంపేవారుగాని తమ మనియార్డర్లన్నీ "మేనేజరు, ప్రజాశక్తి" అనే అడ్రసుకు చేయాలి. వ్యక్తుల పేరుతో పంపనవసరంలేదు. వ్యక్తుల పేర్లకు పంపడంవల్ల వారు ఆసమయానికి వూళ్ళో లేకపోవడం జరుగుతోంది. దీనివలన అనవసర ఆలస్యం, చిక్కు కలుగుతోంది. క్రింద కూపనులో మాత్రం ఆడబ్బు యెందునిమిత్తం పంపేది వివరంగావ్రాయాలి. పంపేవారి పేరు, అడ్రసుకూడా క్రింద కూపనులో వ్రాయాలి.

(4వపేజీ తరువాయి) రైతుసంఘాలద్వారాగాని అమ్మి రాయలసీమ, పల్నాడు కరువు పరిష్కారానికి తోడ్పడ గోరుచున్నాను. ప్రతి రైతు, ప్రతి గ్రామము తమకు కావలసిన ధాన్యాన్ని నిల్వచేసుకొని మిగులు ధాన్యాన్ని పైవిధంగా అమ్ముట ద్వారానే మన రాష్ట్రంలో కరువు రాకసి రాకుండా రక్షించుకోగలం.

★ మ హి ళా లో క ం

"ఇలాంటి స్కూల్సు స్త్రీల అభ్యున్నతికి ఎంతేని అవసరం"

గుంటూరు జిల్లా 4 వ మహిళా శిబిరం జయప్రదంగా జరిగింది

ఒకవైపున జపాను సరిహద్దులలోపొంచి వుంది. మరోవైపు దేశంలో కరువు. ఈక్లిష్ట పరిస్థితులలో సంఘంలో సగభాగంగా వున్న మహిళల కర్తవ్యం ఏమిటి? దేశరక్షణ విషయంలో వారి బాధ్యత లేమిటి? సామాజికంగా యిపుడున్న స్థితినుండి బాగుపడడం ఎలాగ?

ఈవిషయాలన్నీ సమగ్రంగా తెలియజెప్పి తమ దేశభక్తిపూరిత కర్తవ్యం నెరవేర్చేటట్లు చేయటానికి జిల్లాలో 4 మహిళా వైజ్ఞానిక శిబిరాలు నడిచాయి. 4 వ శిబిరం 5—10—43 నుండి 30—10—43 వరకు గుంటూరుటౌన్‌లో జరిగింది. 17 గురువిద్యార్థినులు వివిధతాలూకాలనుండి హాజరైనారు.

రాజకీయాలు, రాజకీయభూగోళం, సివిక్సు, పత్రికాపఠనం, మహిళాఉద్యమం, వివాహం, వారసత్వ హక్కు, ప్రథమ చికిత్స, ఆరోగ్య సూత్రాలు, విమానదాడి రక్షణ మొదలగు విషయాలపై పాఠాలు చెప్పారు. మాదల వీరభద్రరావు, బి. వెంకటేశ్వరరావు, వున్నవ గోపాలకృష్ణయ్య, డాక్టర్ అర్. పుండరీకాక్షుడు, మోటూరి ఉదయం, సి. పద్మాక్షమ్మ గారలు ఉపన్యాసకులు.

అధికారుల సహకారం

మునిసిపల్ లేడీ డాక్టర్‌గారు (మహమ్మదీయస్త్రీ) 3 రోజులు "శిశుపోషణ, ప్రసూతి జాగ్రత్తలపై" వుపన్యసించారు. బొమ్మలు, చార్టులు, మాజిక్ లాంతరు ప్రదర్శనాలతో విద్యార్థినులకు వివరంగా బోధించారు. శిశు మరణాలు, ప్రసూతి రోగాలు అసంఖ్యాకంగా వున్న భారతదేశంలో ఇలాంటి ఉపన్యాసాలు ఎంతో ఉపకరించుతాయి. క్యాంపుకు వచ్చిన స్త్రీలలో ఒక ముస్లిం స్త్రీవిద్యార్థిని (బురహాన్ బీ) వుండుట చూచి "కుల, మత విచక్షణ లేకుండా స్త్రీలఅభ్యున్నతికి కృషిచేయాలంటే ఇలాంటి స్కూల్సు ఎంతేని అవసరం" అని డాక్టర్‌గారన్నారు.

కో-ఆపరేటివ్ డెప్యూటీ రిజిస్ట్రారుగారు, విద్యార్థినులకు సహకారసంస్థలపైనా, వివిధ తాలూకాలలో నెలకొల్పదగిన పరిశ్రమలను గూర్చి, అధికోత్పత్తి మొదలగు విషయాలపై అమూల్యమైన సలహాలతో వుపన్యసించారు. కాగిత పరిశ్రమ నెలకొల్పుటకు కృషిచేస్తే జిల్లా కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు ద్వారా ఆర్థిక సహాయం గూడ చేస్తామన్నారు. పరీక్షనేవున్న కో-ఆపరేటివ్ ఇన్‌స్పెక్టరు గారు "వందలకొలది లెక్చర్లు యిచ్చినా యిలాంటి ట్రైనింగుకు సరిరాదండీ; ఇలాంటి శిబిరాలద్వారా నిర్మాణ కార్యక్రమం యెంతో జరుపవచ్చున"న్నారు.

26—10—43 వ తేదీన ప్రభుత్వంచే నడుపబడుచున్న "లాంఫారమ్"కు విద్యార్థినులు వెళ్లారు. అచ్చట వివిధరకాలైన వృక్షములు, కూరగాయల చెట్లు ఆధునిక పద్ధతులతో పెంచటం, పశుపోషణ వగయిరాలను గూర్చి విద్యార్థినులు వివరంగా తెలుసుకున్నారు. ఫారమ్ మేనేజరు, ఫారమ్ డాక్టరు గారలు ప్రత్యేక శ్రద్ధవహించి, ప్రతి విషయం విపులంగా వివరించారు. మహిళల కృషిని, కార్యదీక్షను ప్రశంసిస్తూ, ఫారమ్ ఉద్యోగి శ్రీ బాపయ్యగారు చిన్న విందు చేశారు. ఇంతమంది స్త్రీలు ఎంతో వుత్సాహంతో, నేర్చుకోవాలన్న దీక్షతో రావటం అచ్చట ఉన్న స్త్రీలకు ఆశ్చర్యం, అనురాగం కలిగించింది.

"అప్పుడప్పుడు యిలాగే వస్తూవుండండమ్మా" అని ఆస్త్రీలుఎంతో ప్రేమతో అన్నారు.

శిక్షణ : కార్యదీక్ష

వర్షం కురుస్తున్నా, జిల్లా యువజన మహాసభా సందర్భంలో, ఊరేగింపులో పాల్గొని తమ కార్యదీక్షను చాటారు.

గోడ వార్తా పత్రిక

"టాన్యా" అనే పేరుతో ఒక చక్కని గోడ వార్తా పత్రిక నొక దానిని తయారు చేసారు. ఆకర్షణీయంగా అందమైన వ్యాసాలతో అలంకరించారు. "భారత వీరకుమారీ," "దేశరక్షణచేయవమ్మా" అనే రెండు వుత్తేజకరమైన పాటలు వ్రాశారు. నిర్భయంగా తమ తమ అభిప్రాయాలు, నేర్చుకున్న విషయాలు, సూచనలు :— యివన్నీ పొందుపరచారు వ్యాసాల్లో.

పెద్దల ఆశీస్సులు

క్యాంపు రోజుల్లో తమ పిల్లలను చూడటానికి తలిదండ్రులు వచ్చేవారు. చింతలపాడు నుండి కూతుర్ని చూట్టానికి వచ్చిన ముసలమ్మ, ఘోరునవర్షం కురుస్తున్నా యువజన సంఘ వూరేగింపులో పాల్గొన్నది. బ్రహ్మాండమైన బహిరంగసభ, వైజ్ఞానిక ప్రదర్శనాలు ఆమెను ముగ్ధురాలను చేశాయి. "ఎక్కడెక్కడినుండో వచ్చినా యిలా అన్యోన్యంగా అన్ని విషయాలు ఎంతో శ్రద్ధగా, ఒద్దికగా తెలుసుకొంటున్నారు. మారుమూలలోవుండి మేముతెలుసుకోలేక పోతున్నాం." అన్నది వెళ్ళిపోతూ.

క్యాంపు డైరెక్టరు సి. పద్మాక్షమ్మగారి తండ్రి గోడ వార్తా పత్రికను చూచి ఎంతో కొనియాడారు. "పత్రికలకు పంపండి" అన్నారు. "అన్నీ వేసుకుంటానికి చోటుంటుందా" అంటే "మీరే మహిళాసంఘం తరపున ఒక పత్రిక నడపండమ్మా. డబ్బు మాటకేం; యిలాంటి మంచి కార్యానికి తప్పక ప్రజాసహకారం లభిం[illegible]ది" అన్నారు.

"ఘోషాపోగొట్టి యిలాప్రచారంచేస్తుంటే మా సంఘం పూరుకుంటుం[illegible]?" అన్నాడు బురహాన్‌బీ ముసలితండ్రి. అయనగారి అన్న ఈ శిబిరం చూచి "ఇదంతా నాకేం తెలుసు? దేశ సేవ చేయడం మంచిదేనమ్మా" అంటూ కూతురు చేతిలో అయిదు రూపాయిలు పెట్టి వెళ్లాడు.

కామ్రేడ్ కంఠంనేని కోటేశ్వరరావు (జిల్లా కమిటీ క్యాండిడేటు) తల్లి, మనమరాలు ఏడిస్తే కోడలు చదువు చెడుతుందేమోనని వెంటవచ్చింది. అయినా ఎలాగో తీరిక చేసుకొని పాఠాలు, చర్చలు వినేది. "అమ్మమ్మా! ఏమిటి నీ అభిప్రాయం?" అన్నా. "ఏముంది నాయనా! కొడుక్కి బి. యస్. సి. దాకా చదువు చెప్పించాను. ప్రయోజకుడై యింత ప్రజాసేవను చేస్తున్నాడు. పార్టీకొరకు ఆస్తిని అమ్ముతున్నా నాకు ఏమీ కష్టమనిపించలా. తెనాలి పార్టీ ఆఫీసుకు, ప్రజలు అనేక సమస్యలపైన సలహాలకోసం వచ్చి చర్చిస్తూ వుండేవారు. వాటిని వింటూంటే నాకు ఎంతో సంబరంగా వుండేది. కొడుకుతోపాటు కోడలుగూడా మేమున్నచోటయినా, యింత ప్రజా సేవచేస్తే అదే పదివేలు" అని సగర్వంగా చెప్పింది.

నా బంధు వొకాయన, కో-ఆపరేటివ్ ఇన్‌స్పెక్టరు, వచ్చి అలంకరించబడిన పటాలు చూచి, రాష్ట్ర క్యాంపులో డ్రిల్లు నేర్చుకుంటున్న మహిళల ఫోటో చూచి, 'వీరభద్రరావు! ఇవన్నీ చూస్తే యితర రాష్ట్రాలను కూడ మించిపోతున్నట్లు తోస్తోంది. స్వీయరక్షణ స్త్రీలకు నేర్పడం, వెనక ఒక మారు బరోడాలో చూచాను. మళ్ళీ యిక్కడ చూస్తున్నాను." అని ఆశ్చర్య చకితుడైనాడు.

25 రోజులు క్యాంపు జయప్రదంగా ముగిసింది. క్యాంపులో మహిళల నేర్చుకోవాలనే శ్రద్ధ, మహిళావుద్యమాభివృద్ధికి వారు నెరవేర్చబోయే కార్యక్రమం — యివన్నీ చూస్తూంటే" మహిళావుద్యమం ఉజ్వల భవిష్యత్తువైపుకు పోతోంది" అన్న కామ్రేడ్ సుందరయ్య వాక్యాలు స్ఫురించాయి. జిల్లా మహిళాసభతో మహిళావుద్యమం ఒక సంఘటితశక్తిగా తయారవుతుంది అన్న ధీమా, ఆత్మవిశ్వాసం కల్గాయి.

—మాదల వీరభద్రరావు.

★ కా ర్మి క లో క ం :

ఫౌండ్రీ కార్మికుల తగాదాలో లేబరుకమీషనరు చర్యలు

మదరాసు లేబర్ కమీషనరు కార్మికుల యెడల తన బాధ్యత ఏవిధంగా నెరవేర్చుచున్నాడో బెజవాడ ఫౌండ్రీ వర్కర్ల తగాదాలో తాను చూపిన దృక్పథమునుండి తేటతెల్లమవుతుంది.

దరిదాపు 3 నెలలనుండి కార్మికులను అక్రమంగా పనినుండి తొలగించి ఉత్పత్తికి భంగము కలుగచేయుట గురించి, కార్మికులకు కరువుబత్తెము గురించి లేబరు కమీషనరుకు తెలియజేస్తుంటే ఎట్టిజోక్యము కలుగజేసుకోకుండా, ఉత్తరములు అందినవో లేవో తెలియజేయుటకూడ ఆ అధికారికి బాధ్యత పట్టలేదు. మదరాసు ట్రేడ్ యూనియన్ ప్రతినిధులు దీనినిగురించి మదరాసులో మాట్లాడితే ప్రతిసారి జిల్లాకలెక్టరునుంచి రిపోర్టుకు ఎదురు చూస్తున్నానని, సాకు చెప్పేవాడు. చివరకు మదరాసు గవర్నమెంటు ఎడ్వైజరుకు ఈవిషయమై తెలియజేయగా ఎంక్వైరీ చేయబడుతుందని అన్నాడు.

ఇది జరిగిన వారం రోజులకు అకస్మాత్తుగా లేబరుకమీషనరుఒకజాబువ్రాశాడు. ఒక రోజుకు వస్తాడనగా తానుచుండూరు వెంకటరెడ్డిఫ్యాక్టరీకి వస్తానని, అక్కడికి యూనియన్ అధ్యక్షుడు వచ్చి తనను చూడాలని కోరుతూ వ్రాశాడు. ఆ ఉత్తరం అందుకొన్నట్టుగా సమాధానం యివ్వాలన్నాడు. ఉత్తరం విశాఖపట్నంలో అక్టోబరు 30 వ తేదీని పోస్టు చేశాడు. ఇక్కడకు అక్టోబరు 31 వ తేదీకి చేరింది. అతను నవంబరు 1 వ తేదీకి ఫ్యాక్టరీకి వస్తానన్నాడు.

1 వ తేదీ నవంబరుకు ఫ్యాక్టరీలోకి వచ్చాడు. అక్కడికి యూనియన్ ప్రతినిధులు వెళ్ళారు. యూనియన్ తెలిపిందేమిటంటే కార్మికుల తగవుగురించి విచారణచేయాలంటే యజమాని ఆఫీసు సరియైన ప్రదేశం కాదని. విచారణచేయవలసిన విషయాలు 2: తీసివేసిన పనివారలను పనిలో పెట్టుకోవడము గురించీ, పనివారందరికీ కరువు బియ్యం యిప్పించాలనీ తెలుపబడ్డాయి. నిరంకుశత్వంతో లేబరు కమీషనరు వీట్లను సరుకు చేయకుండా అసందర్భ విషయాల గురించి విచారణ మొదలెట్టాడు. మొదట తెలిపింది తాను ఎంక్వైరీ చేసేది ఏమీలేదని అంతకుముందు కలెక్టరు రిపోర్టు పంపాడని అన్నాడు. కలెక్టరు ఏమి రిపోర్టు పంపాడో, ఫలితమేమిటో చెప్పాడు కాదు. మదరాసులో యూనియన్ ప్రతినిధి అడిగితే కలెక్టరు యింకా రిపోర్టు పంపలేదన్నాడు.

చాటుగా కొంతమందిని చుండూరు రెడ్డి పనిలో పెట్టుకొని వారిచే క్షమాపణ అడిగినట్లు యూనియన్‌కు కంప్లెయింటు చేయగా యూనియన్ యెడల చుండూరు రెడ్డి ఎంత కక్ష వహించాడో, ఒ[illegible] తార్కాణము చూపుతూ లేబరు కమీషనరుకు ఒకప్పుడు వ్రాయబడింది. దానిగురించి మాత్రము యజమానిముందు, అతని ఆఫీసులో, పని చేస్తున్న పనివానిని పిలిపించి విచారణ మొదలెట్టాడు. ఫ్యాక్టరీలో పనివారలకు దెబ్బలు తగిలినప్పుడు యూనియన్ వేసిన కరపత్రం ఆక్షేపణయని యజమానిని చర్యతీసుకోమని ప్రాధేయపడ్డాడు. లేబరు కమీషనరు ఫాక్టరీకి విచ్చేయడము యిందుకోసమా అన్నట్లు వెల్లడి చేసుకున్నాడు. ఏదో సాకుకోసము ఎదురుచూస్తూ కార్మికుల హక్కులను త్రోసివేయాలన్నట్లు కనబడింది.

తరువాత ఒక వారము రోజులు పోయిన తర్వాత లేబరు కమీషనరు ఒక రిపోర్టు పంపాడు దాని సారాంశము రెడ్డి ఫౌండ్రీలో కాళీలున్నట్లు వాట్లను సప్లయిచేయుటకు గవర్నమెంటు యిండస్ట్రీ డిపార్టుమెంటు నేషనల్ సర్వీసు లేబరు ట్రిబ్యూనల్ మనుష్యులను సప్లయి చేయాలని తెలియచేస్తూ ఉంది.

ఈలేబరుకమీషనరుకార్మికులకు తీవ్రమైన హానిచేశాడు. యజమాని చర్యలను సమర్థించాడు పైకూలీలను తెప్పించి తీసివేయబడిన కార్మికులకు యజమానితోకలిసి దెబ్బతీశాడు.

కాని కార్మికులు యిట్టి నిరంకుశాధికారులకు లొంగరు. తమ శక్తిని వినియోగించి హక్కులను నిలబెట్టుకుంటారు. యజమానులు, నిరంకుశాధికారులు ఎంత సంకుచిత దృష్టితో కార్మికులను దెబ్బకొట్టినప్పటికి కార్మికులు తమ దేశభక్తిపూరితమైన అధికోత్పత్తి సాగిస్తారు.

ఫౌండ్రీ కార్మికులు తమ పని వచ్చేవరకు, కరువు భత్యము వచ్చేవరకు ప్రజా సహకారముతో కార్యక్రమము సాగిస్తారు.

★

కార్మిక సంఘాలను గుర్తించే బిల్లు

ఆంధ్రరాష్ట్ర ట్రేడ్‌యూనియను కౌన్సిలు కార్మిక సంఘాలకు యీ దిగువ హెచ్చరిక చేస్తున్నది.

సెంట్రలు అసెంబ్లీలో కార్మిక సంఘాలను యజమానులు గుర్తించుటకు ట్రేడ్ యూనియన్ అక్టు సవరణ బిల్లు తీసుకురాబడుతుంది. కార్మిక సంఘాలను యజమానులు గుర్తించాలని ప్రతి సంఘము మొదటినుంచి చేస్తున్న అందోళన ఫలితమేయిది. యిది రిజిస్టరు కాబడ్డ యూనియన్లకే వర్తిస్తుంది. కొత్త సంఘాలన్నీ రిజిస్టరు తప్పక చేసుకోవాలి. యీ బిల్లు గురించి కార్మికులలో ప్రచారము చేసి బలపర్చాలి. బిల్లుమీద కరపత్రము ట్రేడ్ యూనియన్ కౌన్సిలు సంఘాలన్నిటికి పంపుతుంది.

★ యు ద్ధ స మీ క్ష

లెబనాన్ ప్రజా విజయం

●

క్రీవ్ విజయానంతరం రెడ్‌ఆర్మీ పురోగమనం మంచి ఉధృతంగానే సాగుతోంది. రెచిట్సాను వశంచేసుకొంది. రెచిట్సా గోమెల్‌కు పశ్చిమంగా పోలండుకు వెళ్ళే రైలు మార్గంమీదవుంది గోమెల్‌నుండి పశ్చిమంగా వెళ్ళే రైలుమార్గంలో గండిగొట్టబడింది. గోమెల్‌కు ఉత్తరభాగంనుండి రెడ్ ఆర్మీ ప్రక్కగా దాటింది. అందుచే గోమెల్ త్వరలోనే రెడ్‌ఆర్మీచేతిక్కుతుంది.

కీవ్‌కు వాయువ్యంగా 90 మైళ్ళలోవున్న కొరోస్టెన్ రెడ్‌ఆర్మీ వశమయింది. జితోమిర్‌వలెనే ఇదికూడ మంచి కీలకస్థానం. కీవ్ - వార్సా రైలుమార్గంమీదవుంది. ఇంకా ఉత్తరాన ఓవరచ్ కూడ రెడార్మీ వశమైంది. ఇది లెనిన్‌గ్రాడ్ - ఒడెస్సా రైలుమార్గం మీదవుంది.

ఈ విధంగా ముఖ్య కీలకస్థానాలను — కూడలిస్థానాలను పోగొట్టుకొనడంవల్ల, జర్మను సైన్యాలకు ఉత్తర దక్షిణ రంగాలలో రాకపోకలకు ఇబ్బంది హెచ్చవుతోంది. ఉత్తరంనుండి పూర్తిగా దక్షిణ సైన్యాలు విడివడిపోయే ప్రమాదం నాజీలకు ఏర్పడుతోంది.

జితోమిర్ రెడ్‌ఆర్మీ వశమయిన నాటి నుండీ కూడ జర్మన్లు ఈ ప్రాంతంలో ఎదురుదాడులకు సన్నాహం చేశారు. లక్షన్నర సైన్యాన్ని కేంద్రీకరించి, విరివిగా టాంకుదళాలను ఉపయోగించి రోజుకు అనేకసార్లు తిరుగుదాడులు ప్రారంభించారు. జితోమిర్ — ఫాస్టావ్ శ్రేణిలో ఈ తిరుగుదాడుల ఒత్తిడి ఫలితంగా కొన్ని ప్రదేశాలను, జితోమిర్‌ను రెడ్‌ఆర్మీ వదలివేయవలసివచ్చింది.

4½ మాసాలుగా సాగించుతూవచ్చిన రెడ్ ఆర్మీ నిర్విఘ్న విజయయాత్రలో వెనుకడుగు వేయడం యిదే మొదటిసారి. ఇది ఏమి తెలియజేస్తుంది? రెడ్‌ఆర్మీ చొరవ తగ్గిందనా? కాదు. రెడ్‌ఆర్మీ ఇంకా అన్నిచోట్ల మా ముందుకు సాగుతూనే వుంది. కొత్త దండయాత్రలను సాగించుతూనేవుంది. కాని జితోమిర్‌లాంటి ఘటనలకు కారణం మిత్రరాజ్యాల నిర్లక్ష్యభావమే. రెడ్‌ఆర్మీయే అంతా చేయగలదు. మనం రెండవరంగం ఇపుడే ఎందుకు కల్పించాలి అనే వారివైఖరివల్లనే రెడ్‌ఆర్మీ ఒంటరిగా పోరాడి అనేకత్యాగాలకు లోనుగావలసి వస్తోంది. జితోమిర్‌ను తిరిగి వదలివేయడం సంభవించింది.

జితోమిర్‌ను ఖాళీచేసినా రెడ్‌ఆర్మీ ఈ ప్రాంతంలోని నాజీలకు ముప్పుతెచ్చే మరొక దండయాత్ర ప్రారంభించింది. కీవ్-క్రెమిన్‌చుగ్‌ల మధ్యనున్న చెర్కాసీ పట్టణం కోసం యుద్ధంసాగుతోంది. ఈ దండయాత్ర ఉద్దేశం ఒకవైపున జితోమిర్ శ్రేణిలోని జర్మన్లకు ప్రమాదంకల్గించడం. మరోప్రక్క జితోమిర్ వద్ద తీవ్ర ప్రతిఘటనఇస్తూ నీపర్‌మలుపులోని సైన్యాలను దాటవేయదలచిన నాజీ ఎత్తులను భగ్నపరచడం. నీపర్‌మలుపులోని జర్మన్లపని పట్టడానికి మరి రెండుచోట్లకూడ కొత్తగా దండయాత్రలు ప్రారంభమైనవని ఆఖరి వార్తలు.

సోవియట్ విజయాలకు అనుగుణ్యంగా తక్కినచోట్ల కూడ మిత్రసైన్యాల ఉధృతం కన్పించడంలేదు. ఇటలీలో యుద్ధం మందకొడిగా సాగుతోంది. డొడకెనీస్ ద్వీపావళిలోని లిరోస్ ద్వీపాన్ని జర్మన్లు వశం చేసికొన్నారు.

ఇలాంటి స్వల్ప విజయాలకికూడ జర్మనీకి తావులేకుండా చేయాలి. జర్మనీకి చేతినిండా పనికల్పించేరెండవరంగం కల్పించాలి. అపుడే ఇలాంటిది సంభవించదు. ఇజ్వెస్టియా చెప్పినట్లు, అక్షరాజ్యాలకంటె మిత్రరాజ్యాల బలం అన్నివిధాలా ఎక్కువేవుంది. ఈబలాన్ని ఎంత త్వరగా, ఎంత ఎక్కువగా ఉపయోగించితే, విజయం అంత త్వరగా లభిస్తుంది.

మాస్కో సమావేశంలో యుద్ధాన్ని త్వరలో ముగించడానికి నిర్ణయం తీసుకోబడింది. ఆ నిర్ణయం త్వరలో అమలు పరిచేటట్లు చేయడానికి, ప్రపంచంలోని అభివృద్ధి కాముక శక్తులన్నీ కృషిచేస్తున్నాయి. అయితే వీరి కృషిని భగ్నం చేయడానికి ప్రయత్నించే అభివృద్ధి విరోధకులు లేకపోలేదు. అమెరికాలో ఇలాంటివారు సోవియట్- వ్యతిరేక ప్రచారంచేస్తున్నారు. ప్రవదా చెప్పినట్లు వారు ఒక్క సోవియట్ వ్యతిరేకులు మాత్రమేగాదు, దేశద్రోహులుకూడాను. ఇట్టి ద్రోహులు సోవియట్- పోలిష్ సరిహద్దుల సమస్యతెచ్చి విషప్రచారం చేస్తున్నారు మెక్సికోలోని సోవియట్ రాయబారి కీవ్‌దాటి ఇంకా 280 మైళ్ళవాకా వెళ్తేగాని సోవియట్ విముక్తి పూర్తిగాదని అన్నాడు. ఇది వాళ్ళ దృష్టిలో పెద్దదోషమయింది. పోలిషు సామ్రాజ్యవాదులు గత యుద్ధానంతరం అక్రమించుకొన్న సోవియట్ భూమినికూడా పోలండే అని పిలుస్తున్నారు. (ఆ విషప్రచారానికి మన పత్రికలుకూడ లోబడటం విషాదకరం.) కరడుగట్టిన సామ్రాజ్యవాది కర్జన్ సైతం సోవియట్ దేశాన్ని పోలిష్‌వారిదని అనలేకపోయాడు.

ఇలాంటి అభివృద్ధి నిరోధకులే బ్రిటన్‌లో నేడేర్పడిన ఫాసిస్టు వ్యతిరేక జాతీయైక్యతను భగ్నంచేయ ప్రయత్నించుతున్నారు. ఆ అభివృద్ధి నిరోధకులకు లొంగియే నేడుమారిసను (మంత్రి) బ్రిటిషు ఫాసిస్టు నాయకుడు, అతని పెళ్ళాన్నీ (మోస్లే దంపతులను) నిర్బంధం నుండి వదలి పెట్టాడు. దానికి కార్మికవర్గమంతా అసమ్మతి తెలియజేసింది. ఇట్టి ఫాసిస్టులను వదలివేసే చర్యలు, ఆంగ్లో-సోవియట్ సన్నిహిత సంబంధాలను చెడగొట్టడానికే ఉపయోగించుతాయి.

ఇటలీలోకూడ అభివృద్ధి విరోధకులు, తాము ప్రజల మార్గాన్నుండి తప్పుకోడం లేదు. ప్రజాస్వామ్య ప్రభుత్వానికి అడ్డుగానున్న రాజు ఇంకా తన పదవీ త్యాగం చేయలేదు. బడోలియో తాను, మిత్రసైన్యాలు రోము చేరగానే రాజీనామా యిస్తావన్నాడు. కాని, ఇటాలియన్ ప్రజాస్వామ్య పార్టీలన్నీ కోరుతున్న కోర్కెను పాటించలేదు. రాజును వదిలించలేదు. ఇటాలియన్ వర్కనేనాధిపతి జనరల్ రోటావంటి ఫాసిస్టును తొలగించినా కాసీమద్య ఏర్పరచిన ప్రభుత్వంలో ప్రజాస్వామ్య ప్రతినిధులెవ్వరూలేరు."

కాని అమెరికా, బ్రిటన్, ఇటలీలలోని అభివృద్ధినిరోధకుల ఆటలు సాగవు. ప్రజలే విజయం పొందుతారు. దీనికి నిదర్శనం లెబనాన్‌లో ప్రజా విజయమే.

ఫ్రెంచి నేషనల్ లిబరేషన్ కమిటీలో దిగాలీ - కట్రూలాంటి అభివృద్ధి కాముకులున్నారు. వీరిని ఫ్రాంసులోని కమ్యూనిస్టులు, ప్రపంచంలోని ప్రజలంతా, సోవియటుయూనియనూ సపోర్టుచేశారు. ఇందులోని జీరోవంటి అభివృద్ధినిరోధకులను బ్రిటిష్, అమెరికన్ సామ్రాజ్యవాదులు బలపరచుతూ వచ్చారు. కాని దిగాలీ ముఠాకే - అంటే ప్రపంచ ప్రజలకే విజయం లభించింది. జీరో రాజకీయ అధ్యక్షపదవిని వదలి సైన్యాధిపత్యానికి పోవలసివచ్చింది. ఈ కమిటీలో కమ్యూనిస్టు లనుకూడ చేర్చుకోవలసిందని ఆల్జీర్సులోని 10 వేలమంది కమ్యూనిస్టులు కోరారు. ఇద్దరిని చేర్చుకొన్నట్లుకూడా ఒకవార్త వచ్చింది. కమ్యూనిస్టులు, ఫాసిస్టు అనుకూలురనందరినీ తుడిచిపెట్టి వారి ఆస్తిపాస్తులను లాగివేయాలని కోరతారు. సామ్రాజ్యవాద పెత్తనాన్ని వహించరు. అందుచేతనే, కమ్యూనిస్టులు ఫ్రెంచి కమిటీలో చేరినా వారిని అంగీకరించకుండా చేయాలని అభివృద్ధినిరోధకులు ప్రయత్నించుతున్నారు. జీరో రాజీనామా ఇస్తానని బెదరించుతున్నాడు. ఈబెదరింపులకు లొంగకుండా దిగాలీముఠా ముందంజ వేస్తుందనడానికి సందేహంలేదు.

దినదినమూ తమపెత్తనం నడలిపోతున్న ఫ్రెంచి కమిటీలోని అభివృద్ధి నిరోధకులు, ఇంకా కొన్ని పదవులలో ఉన్నారు. లెబనాన్‌లోని హెల్లూ అలాంటివాడే. లెబనాన్ స్వాతంత్ర్యం ప్రకటించుకొన్న జాతీయనాయకులను అరెస్టుచేసి అక్కడ చిచ్చురగిల్చాడు. అక్కడ ముస్లిములు క్రిస్టియన్లు అంతా ఏకమై ఈ చర్యలను నిరోధించారు. లెబనాన్‌కు అండగా అరబ్బు ప్రపంచమంతా నిలచింది. ఈ జాతీయైక్యత ముందు ఫ్రెంచి కమిటీలోని అభివృద్ధి నిరోధకులు నిలవగలరా?

కట్రూ లెబనాన్‌పోయి పరిస్థితులను చక్కబరచాడు. మొన్నటి శాసనసభ అధ్యక్షునే తిరిగి అధ్యక్షునిగా ప్రకటించాడు. అరెస్టుచేసిన మంత్రులను విడుదలచేశాడు. నిర్బంధాలకుకారకుడైన హెల్లూను ఆల్జీర్సుకు పంపివేశాడు. ఈ చర్యలన్నిటిద్వారా ఫ్రెంచి కమిటీకి విచీ అనుకూలురవల్ల గల్గిన మచ్చ మాయమవడానికి అవకాశం దొరికింది. జాతీయైక్యతఉన్ననాడు సామ్రాజ్యవాదుల ఆటలుగాని — ఫాసిస్టు అనుకూలుర ఆటలుగాని సాగవని మనదేశానికి లెబనాన్ ఒక పాఠం గరిపింది.

— తుమ్మల వెంకటరామయ్య
22—11—43

కొత్త ప్రచురణలు

1.	రాజకీయభూగోళం (పటాలతో సహా రెండవముద్రణ)	0-12-0
2.	హిట్లరు పరాభవం (వీధిభాగవతం-కొత్తపాటలు)	0- 4-0
3.	శిశుహంతకులు	0- 3-0
4.	ఆకలి మంటలు (పిచ్చిగుంటల కథ)	0- 2-0
5.	నిర్మాణ సమస్యలు - స్టాలిన్	0- 4-0
6.	స్వాతంత్ర్య సంగ్రామం (స్టాలిన్ ఉపన్యాసాలు)	0-10-0
7.	జపాను విజస్వరూపం	0-10-0

త్వ ర లో

లెనిన్‌గ్రాడ్ యువజన వీరులు
రష్యన్ యుద్ధకథలు
ప్రజానాయకుడు స్టాలిన్
నేను స్వయంగా చూచాను - ఎడ్గార్ స్నో
భారత కమ్యూనిస్టుపార్టీ నిర్మాణచరిత్ర

(12 వ పేజీ తరువాయి) దగ్గరకువచ్చి "మా గ్రామాల్లో రైతుసంఘాలు పెట్టండి బాబూ" అని అడుగుతున్నారు.

ఉరవకొండలో చేనేతపనివారలలో ప్రచారం జరుగుతున్నప్పుడు 85 ఏండ్ల వృద్ధురాలు పరిచారకుల మాటలన్నీ విని, "చిన్నవాళ్ళయినా యిన్నివిషయాలు యెప్పుడు నేర్చుకున్నారు నాయనా! దేశంకోసం బాగాపనిచేస్తున్నారు" అని సంతోషంతో తాను దరిద్రంతో బాధపడుతున్నా పార్టీకి చందా నిచ్చింది.

8 ఏండ్ల బాలుడు సంతకం చేస్తానని పట్టుబట్టి సంతకంచేసి, ఇంకా 10 మంది పెద్దవాళ్ళవద్దకు పోయి, నాయకులు బయటికి వస్తారు, సంతకాలు చేయండని, సంతకాలు చేయించాడు.

కాంగ్రెసు—ముస్లిం—కమ్యూనిస్టు

కర్నూలుజిల్లాలో కాంగ్రెసు నాయకులు' లీగ్ నాయకులు జాతీయైక్యతా నినాదానికి సుముఖులు. జాతీయ నాయకుల, కమ్యూనిస్టు నాయకుల విడుదల కోరుతూ 300 మంది ముస్లింలు సంతకాలుచేశారు. జరిగిన 13 బహిరంగసభలలోను, వచ్చిన 2,500 మంది ప్రజలలోనూ మూడవవంతు మహమ్మదీయులు.

వెలుగోడులో 5 వ తేదీన ముస్లిం ప్రదేశంలో ఒక బహిరంగసభ జరిగింది. హాజరయినవాళ్ళలో 80 మందిముస్లింలు, 10 మంది హిందువులు.

స్వయంనిర్ణయసూత్రం, ఐక్యతా నినాదం ఘోషాస్త్రీలనుకూడా కదల్చివేసింది. సభకు ఘోషాస్త్రీలుకూడా హాజరయారు.

మహిళా ఉద్యమానికి అంకురార్పణ, ఈవారంలో జరిగింది. సంచారంచేసిన 14 దళాలలో ఒకటి స్త్రీలది, ఈదళం మూడుమంది మహిళలలో ప్రచారంగావించింది. అందులో 81 మంది సంతకాలు చేశారు. 43 మంది 25-10-0 విరాళాలిచ్చారు.

మొత్తం 26 గ్రామాలలో, 3,500 మందిలో ప్రచారం జరిగింది. 2,700 మంది సంతకాలు చేశారు. 2,500 మంది బహిరంగసభలకు హాజరయారు. 600 మంది 300 రూపాయలు విరాళాలిచ్చారు.

కర్నూలులోని ఈ నూతన సంచలనం చూసి, చుట్టుపక్కల గ్రామీయులు ప్రచారకుల్ని తమ తమ గ్రామాలకు రమ్మని ఆహ్వానించారు. పార్టీనిధి ఇస్తామని వాగ్దానంచేశారు.

● ● ●

జాతీయ ఐక్యతావారంలో—పార్టీసభ్యులలో దాగుడుమూతలాడుతున్న విస్పృహ పటాపంచలయింది.

—కాంగ్రెసు-లీగ్‌లలో ప్రధాననాయకులు తాటస్థ్యం వహించినా, అనుచర సామాన్యం సుముఖత, ఉత్సాహం చూపించింది. కొన్నిచోట్ల ముందుకొచ్చి ప్రజాపీకాన్ని ఐక్యవరచడానికి చేయూత నిచ్చింది.

కాని, ఇందులో అపశృతులు లేకపోవా, విజయనగరంలో జరిగిన బహిరంగసభను భగ్నంచేయడానికి కొందరు కాంగ్రెసువాదులు ఆటోతును ప్రజలమీదకు తరిమారు.

నాయుడుపేటలో, కొందరు కాంగ్రెసువాదులు దుష్ప్రచారం సాగించారు. "మీవాడు కమ్యూనిస్టు పార్టీలో ఉన్నాడు. ప్రభుత్వం దెబ్బతీస్తుంది. జాగ్రత్త" అనీ, "జపాను వస్తే, కమ్యూనిస్టులను ముందు ధామ్మనిపిస్తుంది, విరమించమనండి," అని కమ్యూనిస్టు వర్కర్ల తలిదండ్రులలో ప్రచారం చేశారు.

అధికారవర్గం కాకినాడ, కావలి, వెంకటగిరిలో ఐక్యతా సభలను నిషేధించారు.

—ప్రజాసామాన్యంలో ఎన్నడూలేని చైతన్యం వచ్చింది. వేలకొలది ప్రజలు బహిరంగసభలకు రావడంచూస్తే రాజకీయ ప్రతిష్ఠంభన వారిని ఎంత బాధిస్తోందో, నిజపరిస్థితులను తెలిసికోడానికి, పరిస్థితులను చక్కబెట్టడానికి ఎంత తహతహతో ఉడికిపోతున్నారో ప్రస్ఫుటమౌతోంది.

END OF ISSUE